శుక్రవారం
16-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 56
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

థాయిలాండ్ ప్రధాని షినావత్రా!

బ్యాంకాక్: థాయిలాండ్ కొత్త ప్రధాని ఎన్నికకు రంగం సిద్ధమైంది. శుక్రవారం పార్లమెంటులో ఓటింగ్ జరగనుంది. దీంతో తమ పార్టీ నాయకురాలు, మాజీ ప్రధాని థైట్టా థవిసిన్ కుమార్తె పెంటోంగ్‌టర్న్ షినావత్రాను ప్రధాని పదవి కోసం నామినేట్ చేస్తున్నట్లు అధికార ఫ్యూ థాయి పార్టీ గురువారం ప్రకటించింది. కోర్టు ఆదేశాలతో ప్రధాని పదవి నుంచి థైట్టా థవిసిన్ తప్పుకున్న తరుణంలో కొత్త ప్రధాని ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఆయన చిన్న కుమార్తె షినావత్రాను ఫ్యూ థాయి పార్టీ ఎంచుకున్నది. ఆమె పార్టీలో మంచి పట్టు ఉంది. షినావత్రాను ప్రధాని పదవికి నామినేట్ చేస్తున్నట్లు పార్టీ ప్రకటన తెలిపింది.

మోదీజీ మణిపూర్ వెళ్లండి

మీకు మళ్లీ విజ్ఞప్తి చేస్తున్నా: రాహుల్

న్యూదిల్లీ: హింసతో అట్టుడికిన మణిపూర్‌లో పర్యటించాలని ప్రధాని మోదీకి మరోసారి విజ్ఞప్తి చేస్తున్నానని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. సాధ్యమైనంత త్వరగా అక్కడ ఘర్షణకు శాంతియుత పరిష్కారం చూపేందుకు కృషిచేయాలని కోరారు. ఇందుకోసం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహించాలన్నారు. దిల్లీలో నివసించే మణిపూర్ ప్రజలను కలిశానని, ఈశాన్య రాష్ట్ర పరిణామాలు

- మిగతా 2 లో



నేడు 'ఎస్ఎస్ఎల్వీ-డీ3' ప్రయోగం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం నుంచి శుక్రవారం ఉదయం 9-17 గంటలకు ఎస్ఎస్ఎల్వీ-డి3 రాకెట్ ప్రయోగం జరుగుతుందని భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం (ఇస్రో) చైర్మన్ శ్రీధర పనికర్ సోమనాథ్ తెలిపారు. తిరుపతి జిల్లా శ్రీ హరికోట లోని స్పేస్ సెంటర్ స్కూల్‌లో జరిగిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి భద్రతా దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2047 నాటికి

- మిగతా 2 లో

40 వేలు దాటిన పలస్తీనా మృతులు

జెరూసలేం: గాజాలో ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మారణహోమం తీరని విషాదాన్ని మిగిల్చుతోంది. ఇప్పటికే 40వేల మందికిపైగా పలస్తీనియన్లు మరణించారు. మృతుల్లో చిన్నారులు, మహిళలు అధికంగా ఉన్నట్లు గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. పుట్టిన నాలుగు రోజులకే కవల పిల్లలను కోల్పోయిన ఓ తండ్రి వేదన వర్ణనాతీతంగా ఉంది. పిల్లల జనన ధ్రువీకరణ తేవడానికి వెళ్లిన ఆయన తిరిగి వచ్చేలోపు బిడ్డలు విగతజీవులుగా కనిపించడం, భార్య కూడా చనిపోవడంతో కలచివేసింది. చనిపోయిన తమ పిల్లల మృతదేహాలను ఆ తల్లిదండ్రులు చేతుల్లో మోసుకెళ్తున్న దృశ్యాలు మొత్తం ప్రపంచాన్నీ కన్నీళ్లు పెట్టిస్తున్నాయి.

వడివడిగా పునర్నిర్మాణం

- 15శాతం వృద్ధిరేటు లక్ష్యం
- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన
- అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు ప్రాధాన్యం
- సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తాం
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గత ప్రభుత్వ విధ్వంస పాలనతో రాష్ట్ర విభజన కంటే ఎక్కువగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం ఒక యజ్ఞంలా సాగాలని, ఇందులో ప్రజలంతా భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం చంద్రబాబు సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. విభజనతో 2014లో ఏర్పడిన నవ్యాంధ్రప్రదేశ్‌కు రాజధాని కూడా లేని పరిస్థితుల్లో నాడు పాలన ప్రారంభించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేసుకుని వేగంగా ముందుకు సాగామన్నారు. దేశంలో ఎవరూ ఊహించని విధంగా సంస్కరణలతో, సమర్థ నిర్ణయాలతో, సరికొత్త విధానాలతో 13.5 శాతం వృద్ధి రేటుతో దేశంలో టాప్ 3 రాష్ట్రాల్లో ఒకటిగా సగర్వంగా నిలబడ్డామని, 120కి పైగా సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచాం. 'ఈజ్ ఆఫ్ డూయింగ్' బిజినెస్‌లో ప్రథమంగా నిలిచామని చెప్పారు. రూ. 16 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకుని దేశం దృష్టిని ఆకర్షించాం. ప్రజల సహకారంతో 34 వేల ఎకరాల భూసమీకరణ చేసి ప్రపంచం చర్చించుకునే డిజైన్లతో సంపద సృష్టించే రాజధాని నిర్మాణం మొదలు పెట్టామని చెబుతూ... దేశంలో నాడు ఆంధ్రప్రదేశ్ ఒక పెద్ద బ్రాండ్ గా ఆవిష్కృతమైందన్నారు. అటువంటి పరిస్థితుల నుంచి గత ప్రభుత్వ విధ్వంస, దోపిడీ విధానాలతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి పోయిందని... రాష్ట్ర విభజన కంటే కూడా 2019 - 24 మధ్య జరిగిన రివర్స్ పాలన వల్లనే రాష్ట్రం ఎక్కువ నష్టపోయిందని చెప్పారు. మళ్లీ ఏపీ బ్రాండ్‌ని తిరిగి సంపాదించాలంటే అందరం కష్టపడాలన్నారు. కూటమి ప్రభుత్వానికి సహకరించాలని చంద్రబాబు కోరారు. ముఖ్యంగా రాష్ట్రానికి సంపద సృష్టి కేంద్రాలైన అమరావతి, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గత 5 ఏళ్లు ప్రజలు ఏ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కోల్పోయి క్షోభను అనుభవించారో, ప్రజలకు ఆ స్వేచ్ఛను తిరిగి అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఈ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సాక్షిగా ప్రకటిస్తున్నానని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన కొనసాగిస్తుందన్నారు. 100 రోజుల ప్రణాళిక టార్గెట్ గా అన్ని శాఖల్లో సమీక్షలు నిర్వహిస్తున్నామని, గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన వ్యవస్థలను క్రియాశీలం చేస్తూ గత 5 ఏళ్లలో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ను తిరిగి పొందేందుకు విప్లవాత్మక చర్యలు తీసుకుంటున్నామన్నారు. సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్ విధానంతో హంగు ఆర్భాటాలకు దూరంగా... ప్రజలకు దగ్గరగా పాలనను అందిస్తున్నామన్నారు.

పేదల జీవితాలు మార్చాలని బాధ్యతలు చేపట్టిన తొలి రోజే 5 కీలక అంశాలపై సంతకాలు చేసి మాట నిలబెట్టుకున్నామన్నారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, సామాజిక పింఛన్లు రూ.4 వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ఉచిత ఇసుక, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీ జీతాలు ఇచ్చే కార్యక్రమాలు చేపట్టామన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం 'సూపర్ సిక్స్' పేరుతో ఆరు హామీలను తీసుకొచ్చామని... వీటిలో కొన్నింటికి ఇప్పటికే శ్రీకారం చుట్టగా... మిగిలినవాటిని త్వరలోనే అమలు చేస్తామని చెప్పారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా కూటమి ప్రభుత్వ నిర్ణయాలు, పథకాలు, పాలసీలు ఉంటాయని సీఎం స్పష్టం చేశారు. విభజన చట్టంలో ఉన్న అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో, తెలంగాణ రాష్ట్రంతో చర్చించి ముందుకు వెళతామని చెప్పారు. అందరి అభిప్రాయాలు తీసుకుని రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం రానున్న రోజుల్లో నిర్దిష్టమైన విధానాలతో పాలన సాగించబోతున్నామని, సమర్థవంతమైన నిర్ణయాలతో, నూతన ఆలోచనలతో 15 శాతం వృద్ధి రేటు సాధించడమే లక్ష్యంగా దృఢ సంకల్పంతో అడుగులు వేస్తున్నామన్నారు. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా స్వర్ణాంధ్ర ప్రదేశ్ - విజన్ 2047ను విడుదల చేయబోతున్నామని చంద్రబాబు ప్రకటించారు. మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తామని, ఎయిర్‌పోర్టులు, పోర్టులు అభివృద్ధి చేస్తామని, రాష్ట్రంలో వంద పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేస్తామని చెప్పారు. విద్య, వైద్యరంగాలకు పూర్వవైభవం తీసుకొస్తామన్నారు. ప్రజలపై ధరల భారం పెరగకుండా పీ4తో పేదరిక నిర్మూలనకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. రాజ్యాంగం ఎంత మంచిదైనా అమలు చేసే పాలకుడు మంచివాడై ఉండాలంటూ అంబేద్కర్ వ్యాఖ్యలను గుర్తు చేస్తూ అటువంటి ప్రభుత్వం వచ్చిందని చంద్రబాబు తన ప్రసంగాన్ని ముగించారు.

ఆశావహులు అనంతం

- నామినేటెడ్ పోస్టులకు 22వేల దరఖాస్తులు
- ఎంపికపై టీడీపీ అదిష్ఠానం కసరత్తు
- పనితీరే కొలమానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు దాటింది. ఈ క్రమంలో పార్టీ విజయం కోసం పని చేసిన వారితో పాటు పొత్తులో భాగంగా సీటు త్యాగం చేసిన నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఈ పదవుల కోసం ఇప్పటి వరకు దాదాపు 22 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇంకా కొంతమంది నేతలు దరఖాస్తులు ఇస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు మూడు పార్టీల క్యాడర్‌తో నామినేటెడ్ పదవులను వెంటనే భర్తీ చేయాలని నిర్ణయించింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అనూహ్యంగా 164 సీట్లు కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. వైసీపీ కేవలం 11 స్థానాలకే పరిమితమైంది. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ, జనసేన నేతలు అనేక రకాలుగా ఇబ్బందులు పడినా ఎన్నికల సమయంలో అధికారమే లక్ష్యంగా పని చేశారు. కూటమి విజయం కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ తో పాటు ఆ పార్టీ కార్యకర్తలు కూడా తీవ్రంగా శ్రమించారు. దీంతో ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు పవన్ కల్యాణ్ కోరుకున్న కీలకమైన

- మిగతా 2 లో

గొప్పలతోనే సరి

- కీలక అంశాల ఊసేలేదు
- పేలవంగా మోదీ పంద్రాగస్టు ప్రసంగం

న్యూదిల్లీ: దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్ర కోట మీద నుంచి ప్రధాని నరేంద్రమోదీ చేసిన ప్రసంగం పేలవంగా సాగింది. కీలక అంశాలు, ప్రజా సమస్యల ఊసే లేదు. దేశ ప్రజలకు స్ఫూర్తి ఇచ్చే విధంగా ఆయన ప్రసంగంలో ఏమీ లేదు. హిందూత్వ భావజాలాన్నీ నూరిపోసే విధంగా విభజన సిద్ధాంతాలతో ఆర్ఎస్ఎస్ అజెండా తప్ప ప్రధాని 11వ సారి చేసిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కొత్తగా ఏమీ లేదు. 2047 లక్ష్యాలు, వికసిత్ భారత్, విశ్వగురువు గురించీ మోదీ మాట్లాడతారు కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు, వాస్తవ సమస్యలను ప్రస్తావించరు. దేశం ఎదుర్కొంటున్న పరిష్కరించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోంది. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)తో పాటు అనేక వివాదాస్పద అంశాలను ప్రస్తావించారు. ఇప్పుడు 'సెక్యూలర్ సివిల్ కోడ్' (లౌకిక పౌర స్మృతి) గళం వినిపిస్తున్నారు. సుప్రీంకోర్టు తరచూ యూసీసీని చర్చించింది. పౌర స్మృతిలో మతాధారిత పౌర స్మృతి ఉంటుందని చాలా మంది విశ్వసిస్తారు. ప్రస్తుతం మనకు 'లౌకిక పౌర స్మృతి' కావాలి. అప్పుడే మతా వివక్ష ఉండదు. రాజ్యాంగ నిర్మాతల విజన్ నెరవేర్చడం మన కర్తవ్యం' అని ప్రధాని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను అస్థిరపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ నివేదికనుద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. 'కొందరు మన ప్రగతిని

- మిగతా 2 లో

స్ఫూర్తిదాయకమేమీ లేదు

మోదీ ప్రసంగంపై సీపీఐ

న్యూదిల్లీ: దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్రకోట నుంచి 11వసారి ప్రధాని మోదీ చేసిన 98 నిమిషాల నిడివి గల ప్రసంగంలో స్ఫూర్తినిచ్చే విషయాలుగానీ కీలక అంశాల ప్రస్తావనగానీ లేదని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. మోదీ మాటల్లో ఆర్ఎస్ఎస్ విభజన సిద్ధాంతాలు, భావజాలమే వినిపించిందన్నారు. 'ప్రధాని 2047 గురించి మాట్లాడతారు కానీ బహుళత్వం-వైవిధ్యత అంశాల

- మిగతా 2 లో

అర్ధరాత్రి రోడ్లపైకి మహిళలు

న్యాయం కోసం డిమాండ్

- ఆర్జీ కార్ ఆసుపత్రిపై మూకదాడి
- ఎమర్జెన్సీ వార్డు ధ్వంసం
- నిరసనకారులపై లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం, హత్య అత్యంత పాశవికంగా జరగడం యావత్ దేశాన్ని కలచివేసింది. మహిళల్లో ఆగ్రహం కట్టలు తెంచుకునేలా చేసింది. దీంతో బుధవారం అర్ధరాత్రి 'మహిళలకు స్వాతంత్ర్యం' పేరిట ఆందోళన మిన్నంటింది. పురుషులు కూడా సంఘీభావం తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అర్ధరాత్రి మహిళలకు స్వాతంత్ర్యం కోసం అంటూ నిరసనకారులు ఆందోళన చేపట్టారు. అర్ధరాత్రి ఆర్జీ కార్ ఆసుపత్రిపై దాడి చేయగా ఎమర్జెన్సీ వార్డును ధ్వసమైంది. నిరసనకారులను చదరగొట్టేందుకు పోలీసులు లాఠీలు ఝుళిపించారు. బాష్పవాయువు ప్రయోగించారు. నిరసనకారులు రాళ్లు రువ్వగా 15మంది పోలీసులకు గాయాలయ్యాయి. రెండు పోలీసు వాహనాలకు, ఒక ద్విచక్ర వాహనానికి ఆందోళనకారులు నిప్పుపెట్టారు. బారికేడ్లు తోసుకుంటూ దూసుకొళ్లిన వారంతా ట్రైనీ డాక్టర్‌కు న్యాయం చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్ అర్ధరాత్రి 2 గంటలకు ఆసుపత్రికి చేరుకుని, పరిస్థితి సమీక్షించారు.

మీడియా ప్రచారం వల్ల ప్రజల విశ్వాసాన్ని కోల్‌కతా పోలీసులు కోల్పోయారని, మీడియా నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురవుతోందని ఆయనన్నారు. సహనం కోల్పోయిన ఆయన 'మేము ఎవరినీ కాపాడేందుకు ప్రయత్నించలేదు. బాధ్యతాయుతంగా పనిచేస్తున్నాం. ఎలాంటి సాక్ష్యాలను నాశనం చేయలేదు' అని అన్నారు. ఈనెల 8వ తేదీన రాత్రి విధుల్లో ఉన్న వైద్యురాలిపై అంత్యంత పాశవికంగా అత్యాచారం, హత్య జరిగాయి. మరుసటి రోజు ఉదయం సెమినార్ హాల్‌లో ఆమె మృతదేహం నగ్నంగా లభ్యమైంది. వాలంటీర్ సంజయ్ రాయ్ ఇప్పటికే అరెస్టు కాగా హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు విచారణను సీబీఐ చేపట్టింది.

తొమ్మిది మంది నిరసనకారులు అరెస్టు

ఆర్జీ కార్ ఆసుపత్రిపై దాడి క్రమంలో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఆసుపత్రిపై దాడి, విధ్వంసానికి సంబంధించిన చిత్రాలను పోలీసులు గురువారం ఉదయం విడుదల చేశారు. అరెస్టు చేసిన వారి గుర్తింపు తెలియలేదు కానీ కోల్‌కతా పోలీసులు విడుదల చిత్రాల్లో తాను ఉన్నట్లు నిరసనల్లో పాల్గొన్న వైద్యుడు అనుభవ్ మొండల్ తెలిపారు. 'మా నిరసనలు కొనసాగుతాయి. మరింత తీవ్రతరమవుతాయి. మేము ఎవరికీ భయపడం. మాకు న్యాయం కావాలి. కోర్టు పర్యవేక్షణ ద్వారా నిష్పాక్షిక

- మిగతా 2 లో

ఇదీ లోకం!

చూడండి, అప్పటివరకూ ఆయనే ఉంటాడట, అంతకాలం కళ్లు మూసుకుని ఉండటం నావల్ల కాదు బాబూ, నేను జంపు!

పేదరికం లేని సమాజమే లక్ష్యం

- పట్టెడన్నం పెట్టి ఆకలితీర్చడంలోనే మానసిక ఆనందం
- అన్న క్యాంటీన్ ప్రారంభ సభలో చంద్రబాబు

విశాలాంధ్ర-గుడివాడ: పేదల ఆకలి తీర్చితే మానసిక సంతోషం కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాష్ట్రంలో అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించారు. గుడివాడలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ గత ప్రభుత్వ దుర్మార్గమైన చర్యల వల్ల అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించుకోవాల్సి వచ్చిందన్నారు. ఇక్కడ మూడు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్టీఆర్ మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నియోజకవర్గం గుడివాడ అన్నారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత తిరుమలకు వెళ్లిన ఎన్టీఆర్ అన్నదానానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఇక్కడ ఎన్టీఆర్ స్టేడియం నెలకొల్పినట్టు చెప్పారు. అరకొర సంపాదనతో జీవించే వారికి అన్న క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతిఒక్కరం కష్టపడేది జానెడు

- మిగతా 2 లో

ఆరోగ్యశ్రీ బిల్లులపై అస్పష్టత

- సేవల నిలుపుదలకు ఆస్పత్రుల నిర్ణయం
- రూ.200 కోట్లు విడుదల చేసినట్టు ట్రస్టు ప్రకటన
- ఖాతాల్లో జమకాని సొమ్ము

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లుల చెల్లింపులపై అస్పష్టత నెలకొంది. ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు నుంచి రూ.200 కోట్లు విడుదలైనట్లు ప్రకటన వచ్చినప్పటికీ, ఆ నిధులు తమకు చేరలేదని ఆంధ్రప్రదేశ్ స్పెషాల్టీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీంతో శుక్రవారం వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో జరిగే ఆశ ప్రతినిధుల భేటీ కీలకం కానుంది. దీంతో నిధుల విడుదల, ఆశ భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత రానుంది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కోట్లాది రూపాయల బిల్లులను వెంటనే

- మిగతా 2 లో

కాల్పుల విరమణపై
నెతన్యాహుకు ట్రంప్ ఫోన్

వాషింగ్టన్: గాజాలో ఇజ్రాయిల్ మారణహోమం కొనసాగుతోంది. ఇజ్రాయిల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కోసం మధ్యవర్తిత్వం అనుకున్న ఫలితాలు ఇవ్వడంలేదు. ఇజ్రాయిల్‌కు అమెరికా అండగా నిలుస్తోంది. ప్రస్తుతం అధ్యక్ష ఎన్నికల హడావిడి అమెరికాలో ఉన్నది. ఇదే క్రమంలో రిపబ్లికన్ పార్టీ తరపున బరిలో నిలిచిన డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్ చేసి గాజా, హమాస్ మధ్య కాల్పుల వివమణ ఒప్పందం తదితర అంశాలపై మాట్లాడారు. కాల్పుల వివరణ కోసం ఇజ్రాయిల్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతోనే ట్రంప్ ఫోన్ చేసినట్లు ఆక్సియోస్ న్యూస్ పోర్టల్ వెల్లడించింది. గాజా స్ట్రిప్‌లో ఆపరేషన్ ఐరన్ స్వార్డ్స్‌ను ఇజ్రాయల్ రక్షణ దళాలు చేపట్టాయి. ఆ ప్రాంతాన్ని పూర్తిగా దిగ్బంధించాయి. అక్టోబరు 7 నుంచి కొనసాగుతున్న దాడుల్లో 40వేల మందికిపైగా పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో చిన్నారులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. లక్ష మంది వరకు గాయపడ్డారు. కాల్పుల విరమణ కోసం చర్చలు పునరుద్ధరించాలని ఈజిప్టు, ఖతార్, అమెరికా కలిసి ఇజ్రాయిల్‌కు పిలుపునిచ్చాయి. ఈ ఒప్పందానికి తుది ప్రతిపాదనతో సిద్ధంగా ఉన్నట్లు మూడు దేశాలు తెలిపాయి.

ఆఫ్రికాలో ఎంపాక్స్ విజృంభణ

గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించిన డబ్ల్యూహెచ్‌వో

జెనీవా/కిన్స్‌హాసా: ఆఫ్రికా దేశమైన కాంగోను కోవిడ్ తరహా ప్రాణాంతక వైరస్ వణికిస్తోంది. కేసులు భారీగా నమోదవుతూ ప్రజలను భయపెడుతోంది. ఇప్పటికే 13కుపైగా దేశాల్లో ఎంపాక్స్ వ్యాపించింది. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) అప్రమత్తమైంది. గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. రెండేళ్లలో ఇలా అత్యవసర పరిస్థితిని ప్రకటించడం ఇది రెండవసారి. కొత్త రకం వైరస్ క్లేడ్ 1బీ ప్రస్తుతం హడెల్ ఎత్తిస్తోంది. ఒకరి నుంచి మరొకరికి ఇది తేలికగా వ్యాప్తి చెందుతోంది. కాంగోతో పాటు బురుండీ, కెన్యా, రువాండా, ఉగాండా తదితర దేశాలకూ ఈ వైరస్ వ్యాపించింది. దీంతో అప్రమత్తమైన డబ్ల్యూహెచ్‌ఓ పరస్పర సహకారంతోనే ఈ వైరస్‌ను అడ్డుకోవచ్చని ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. ఈ వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేసి, ప్రాణాలను కాపాడేందుకు దేశాల మధ్య సయోధ్య అవసరమని డబ్ల్యూహెచ్‌వో డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనోమ్ గేబ్రియేసస్ తెలిపారు. కాంగోలో 70 శాతం బాధితులు 15ఏళ్ల లోపు వారేనని, రెండు వారాల పసిబిడ్డ కూడా ఎంపాక్స్ బారిన పడినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. ఈ వైరస్ సోకిన వారిలో మరణాల రేటు 3-4 శాతం ఉంటుందని ఆఫ్రికాకు చెందిన సీడీసీ ఎమర్జెన్సీ గ్రూప్‌కు చెందిన సలీం అబ్దుల్ కరీం వెల్లడించారు. 2022లో ఎంపాక్స్ క్లేడ్ 2 వేగంగా విస్తరించింది. దీంతో అప్పుడు కూడా డబ్ల్యూహెచ్‌వో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. కాగా, ఎంపాక్స్‌ను గతంలో మంకీ పాక్స్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం వజృంభిస్తున్న వైరస్ మరింత ప్రాణాంతకంగా మారినట్లు నిపుణులు తెలిపారు. ఆఫ్రికాలో 17వేలకుపైగా ఎంపాక్స్ కేసులు నమోదు కాగా 517 మరణాలు సంభవించాయి. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం తీవ్రత 167శాతం అధికమని ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ వెల్లడించింది. 13 దేశాల్లో ఎంపాక్స్ కేసులు వెలుగులోకి వచ్చినట్లు తెలిపింది. ఈ వైరస్‌లో రెండు రకాలు ఉన్నాయి. ఎంపాక్స్‌లో క్లేడ్ 1, క్లేడ్2 అనే వేరియంట్లు ఉన్నాయి. క్లేడ్ 2 సోకిన వారిలో 99.9 శాతం మందికి ప్రాణాపాయం ఉండదని యూఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తెలిపింది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే మాత్రం ఆరోగ్యం క్షీణిస్తుందని వెల్లడించింది.

ఇజ్రాయిల్‌పై ప్రతీకారం తీర్చుకోవాల్సిందే: ఖమేనీ

టెహ్రాన్: ఇజ్రాయిల్‌పై ప్రతీకారం తీర్చుకొని తీరుతామని ఇరాన్ అధినాయకుడు ఆయాతుల్లా ఖమేనీ తేల్చిచెప్పారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. హమాస్ నాయకుడు ఇస్మాయిల్ హానియా హత్యకు, గాజాలో జరుగుతున్న మారణహోమానికి ప్రతీకారం తీర్చుకొనేందుకు ఇరాన్ అస్త్రాలు సిద్ధంచేసుకుంటోంది. ఇజ్రాయిల్ విషయంలో వెనక్కి తగ్గితే దైవాగ్రహానికి గురి కావాల్సి వస్తుందని ఖమేనీ హెచ్చరించారు. రాజకీయ, సైనిక, ఆర్థిక విషయాల్లో వెనక్కి తగ్గేదే లేదన్నారు. ఆధిపత్య శక్తులకు ప్రభుత్వాలు తలొగ్గుతున్నాయన్న ఖమేనీ... పరిణామం, బలం, బలగాలు కాదు ప్రత్యర్థి సామర్థ్యాన్ని కచ్చితంగా అంచనా వేయగలగడం ప్రభుత్వాలకు తెలియాలని, శత్రువు బలాలు, బలహీనతలు తెలిసినప్పుడే గెలుపు ఎలాగో తెలుస్తుందని అన్నారు. 1979 నుంచి అమెరికా, బ్రిటన్, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్‌ను దెబ్బతీయాలని చూస్తున్నాయని గుర్తుచేశారు. ఇదిలావుంటే ఇరాన్ దూకుడుకు కళ్లెం వేయగలమని, అతిగా ప్రవర్తిస్తే ప్రతిస్పంద తప్పబోదని ఇజ్రాయిల్ కూడా హెచ్చరికలు జారీచేసింది.

వయనాడ్ బాధితులకు ఇస్కఫ్ రూ.25వేలు విరాళం

విశాలాంధ్ర-విజయవాడ: కేరళలోని వయనాడ్ జిల్లాలో ప్రకృతి విలయానికి సర్వం కోల్పోయిన బాధితులకు భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం(ఇస్కఫ్) 25వేల రూపాయల ఆర్థిక సహాయం అందించింది. ఈ మేరకు ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు పరుచూరి అజయ్‌కుమార్ గురువారం స్థానిక దాసరి భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను కలిసి విరాళాన్ని అందజేశారు. విరాళాల సేకరణలో ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, ఇస్కఫ్ నాయకులు మోతుకూరి అరుణ్‌కుమార్, బుద్ధవరపు వెంకట్రావ్, మహబూబ్ ఆజం పాల్గొన్నారు.

నేడు 'ఎస్ఎస్ఎల్వీ-డీ3' ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

రాకెట్ ప్రయోగాల్లో వికసిత్ భారత్‌గా నిలవాల్సి ఉందని అన్నారు. ఈ ఏడాది భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులని ఆకట్టుకున్నాయి. ప్రతిభావంతులకు బహుమతులను ఆయన అందజేశారు. కాగా తాజాగా ప్రయోగించనున్న ఎస్ఎస్ఎల్వీ-డీ3 భూ పరిశీలన ఉపగ్రహం. ఇస్రో... ఉపగ్రహ ప్రయోగాల కోసం ఎక్కువగా పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ రాకెట్లపై ఆధారపడుతూ వస్తోంది. ఇటీవల ఎస్ఎస్ఎల్వీ పేరిట రూపొందించిన సరికొత్త రాకెట్‌ను వినియోగిస్తోంది. రేపటి ప్రయోగం ఎస్ఎస్ఎల్వీ పరంపరలో మూడోది. ఈవోఎస్-08 శాటిలైట్ ను మోసుకుంటూ ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ ఆగస్టు 16వ తేదీ ఉదయం 9.17 గంటలకు నింగిలోకి దూసుకెళ్లనుంది. ఉపగ్రహాన్ని భూమికి 475 కిలోమీటర్ల ఎగువన వృత్తాకార కక్ష్యలో ప్రవేశపెట్టనున్నట్లు ఇస్రో వెల్లడించింది. ఎస్ఎస్ఎల్వీ చాలా ప్రత్యేకమైన రాకెట్. దీన్ని కేవలం 72 గంటల వ్యవధిలో ప్రయోగానికి సిద్ధం చేయవచ్చు. ముఖ్యంగా ఈ రాకెట్ ద్వారా ఉపగ్రహాలను రోదసిలోకి తీసుకెళ్లేందుకు చాలా తక్కువ ఖర్చవుతుంది. 2022లో తొలిసారిగా నిర్వహించిన ఎస్ఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఆ మరుసటి ఏడాది నిర్వహించిన ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో ఉత్సాహం నెలకొంది. ఈసారి ఎస్ఎస్ఎల్వీ మోసుకెళ్లనున్న ఈవోఎస్-08 ఉపగ్రహం ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్ ఫ్రారెడ్ పేలోడ్ (ఈవోఐఆర్), గ్లోబల్ నేవిగేషన్ శాటిలైట్ సిస్టమ్ రిఫ్లెక్టోమెట్రీ పేలోడ్ (జీఎన్ఎస్ఎస్-ఆర్) తదితర వ్యవస్థలను కలిగి ఉంటుంది.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

పొట్ట కోసమేనని, కడుపు నిండా తిండి తినాలని ఆశిస్తామని అన్నారు. ఎంతోమంది ఆకలి తీర్చిన మహనీయురాలు డొక్కా సీతమ్మ అన్నారు. గోదావరి దాటి వచ్చినవాళ్లకు తిండి పెట్టిన అన్నపూర్ణ అని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నామని, సెప్టెంబరు నాటికి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామని సీఎం చెప్పారు. అన్న క్యాంటీన్లను మూసేయొద్దని గత ప్రభుత్వానికి చెప్పినా పట్టించుకోలేదనన్నారు. దాతలకు అవకాశం ఇవ్వాలని చెప్పినా వినలేదన్నారు. దాతలు ఐదు రూపాయలకే భోజనం పెడుతుంటే అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాళ్లకు తిండి పెట్టడం మనందరి కనీస బాధ్యత అన్నారు. హరేకృష్ణ ఛారిటబుల్ ఫౌండేషన్ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. పేదరికం లేని సమాజం కావాలన్నదే తన కల అన్నారు. జనవరిలో జన్మభూమి-2ని ప్రారంభిస్తామన్నారు. ప్రతి ఒక్కరికి ఖర్చు తగించి జీవన ప్రమాణాలు మెరుగుపడడానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో ఎక్కడ బూతులు వినబడడం లేదని, ఇసుక, భూములు దోపిడి లేదన్నారు. పేదవాడికి సంపద సృష్టించే బాధ్యతను తాను చూసుకుంటన్నారు. కుటుంబ నియంత్రణ వల్ల జనాభా గణనీయం తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కుటుంబంలో ఎక్కువ మంది ఉంటేనే ప్రేమలు పెరుగుతాయన్నారు. దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.కోటి విరాళం ఇచ్చిన నారా భువనేశ్వరి, వ్యాపారవేత్త శ్రీనివాసరాజును సీఎం సత్కరించారు. కృష్ణాజిల్లాకు చెందిన మచిలీపట్నం ఎంపీ, ఏడుగురు ఎమ్మెల్యేలు కలిసి మరో రూ.50 లక్షలు అందజేశారు. తొలుత సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలతో కలసి అన్న క్యాంటీన్‌లో భోజనం చేశారు. ప్రజల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ పోషణ ఎలాఉందని ప్రశ్నించారు. వారికి సదుపాయాలనుఅందజేయాలని కలెక్టర్ బాలాజీని ఆదేశించారు. మంత్రి కొల్లు రవీంద్ర, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, వర్ల కుమార్‌రాజా, కాగిత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావ్, బోడే ప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బిల్లులపై అస్పష్టత

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేయాలని, లేకుంటే ఆస్పత్రుల సేవలను నిలుపుదల చేస్తామంటూ ఆశ వెల్లడించింది. ఆ మేరకు ప్రభుత్వం ముందు అనేక డిమాండ్లు పెట్టింది. గత నెల 29న వివిధ వివిధ డిమాండ్లతో ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు సీఈవోకు ఆశ నేతలు లేఖరాశారు. తమకు పెండింగ్ బిల్లులు ఇవ్వకుంటే సేవలు నిలిపివేస్తామని స్పష్టంచేశారు. తమ ఆర్థిక ఇబ్బందులు, సమస్యలపై ప్రభుత్వం చర్చించాలని కోరారు. దీంతో ట్రస్టు సీఈవో స్పందించి ఈనెల 14వ తేదీ రాత్రి రూ.200 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. మరో వారంలోగా రూ.300 కోట్లు ఇస్తామని ప్రకటించారు. ఎన్టీఆర్ ట్రస్టు ప్రకటించిన రూ.200 కోట్లు స్పెషాల్టీ హాస్పిటల్స్‌కు ఎక్కడా చేరలేదని, అవి వారి ఖాతాల్లో జమ కాలేదని ఆశ ప్రతినిధులు చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్పెషాల్టీ హాస్పిటళ్లకు రూ.2,500 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ప్రతినెలా వాటికి రూ.250 కోట్లు అదనగా కలుస్తోంది. నాణ్యమైన వైద్యం అందించే క్రమంలో ఈ భారాన్ని తాము మోయలేకపోతున్నామని ఆశ నేతలు చెబుతున్నారు. గత ప్రభుత్వాల నుంచి నిత్యం ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. అనేకసార్లు ప్రభుత్వంపై అసోసియేషన్ నేతలు ఒత్తిడితెచ్చినప్పటికీ, ఫలితం లేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలోను తమ సేవలను ఆపేస్తామని ప్రకటించినా అప్పటి ప్రభుత్వం స్పందించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర నెలల్లోను పేరుకుపోయిన బిల్లులపై స్పందించడం లేదు. దీంతో వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో భేటీ అవుతున్నట్లు ఆశ ప్రతినిధి తెలిపారు. ఏళ్ల తరబడి ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో పెడితే, తమ హాస్పిటళ్ల నిర్వహణ భారంగా మారుతుందని, తక్షణమే వాటి చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని ఆశ డిమాండ్ చేస్తోంది. వారానికి ఒక సారి బిల్లుల చెల్లింపు ఉండేలా చూడాలని పేర్కొంటున్నారు. వైద్యారోగ్యశాఖ మంత్రి వివిధ వేదికలపై తరచూ హామీలు ఇస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుంచి ఖచ్చితమైన హామీ లేకపోవడంతో నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రితో భేటీ అనంతరం ఆశ భవిష్యత్ కార్యచరణ ఉంటుంది.

నేడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలుస్తాం: డాక్టర్ అవినాశ్

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఇంకా బిల్లులు జమ కాలేదని, దీనిపై శుక్రవారం వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలవనున్నట్లు ఆశ సెక్రటరీ డాక్టర్ సిహెచ్.అవినాశ్ తెలిపారు. ఇప్పటికే బకాయిలు చెల్లించకపోవడంతో ఆస్పత్రుల నిర్వహణ భారంగా మారిందన్నారు. ఈ విషయాన్ని ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ సీఈవోకు తెలిపామని గుర్తుచేశారు. ట్రస్టు నుంచి రూ.200 కోట్లు విడుదలైనట్లు తాము సమాచారం తెలుసుకున్నామని, అయితే ఇంతవరకు ఎక్కడా నెట్‌వర్క్ ఆస్పత్రుల ఖాతాల్లో సొమ్ము జమకాలేదని స్పష్టంచేశారు.

మోదీజీ మణిపూర్ వెళ్లండి

(మొదటిపేజీ తరువాయి)

కలచివేస్తున్నాయని రాహుల్ గురువారం వెల్లడించారు. తమ వారితో విడిపోయి శారీరక-మానసిక క్షోభను మణిపూర్ ప్రజలు అనుభవిస్తున్నారని 'ఎక్స్'లో ఆవేదన వ్యక్తంచేశారు. తనను కలిసిన మణిపూర్ ప్రజలు ప్రాణభయంతో తమ గుర్తింపును గోప్యంగా ఉంచాలని కోరారన్నారు. వాళ్లు తన చెయ్యి పట్టుకొన్న ఫొటోను రాహుల్ పోస్టు చేశారు. 'మణిపూర్‌లోని మన సోదర, సోదరీమణులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తుండటం చేదు నిజం. స్వాతంత్ర్య దినోత్సవాన మణిపూర్ దుస్థితిని, స్వాతంత్ర్యానికి దూరంగా దినదిన గండంగా బతుకుతున్న అక్కడి ప్రజల వెతలను గ్రహిద్దాం. వారి బాధలను పంచుకుందాం' అని రాహుల్ పిలుపునిచ్చారు. మణిపూర్‌లో పర్యటించాలని ప్రధాని మోదీకి ఆయన మరోసారి విజ్ఞప్తి చేశారు. మణిపూర్ సమస్య పరిష్కారానికి రాహుల్‌కున్న చిత్తశుద్ధికి ఈ సమావేశం అద్దం పట్టిందని, మణిపూర్ దుస్థితిని నిర్లక్ష్యం చేయలేమన్న గట్టి సందేశాన్ని భారతీయులకు ఇచ్చిందని కాంగ్రెస్ నేతలు అన్నారు. రాహుల్‌తో మణిపూరీల సమావేశం ద్వారా ఈశాన్య రాష్ట్ర ప్రజలకు సంఘీభావ సందేశం వెళ్లిందన్నారు.

స్వాతంత్ర్యం మన రక్షణ కవచం

దేశ పరిరక్షణ కోసం బలిదానాలకూ సిద్ధమని, మన పూర్వీకులకు మనమిచ్చే నిజమైన నివాళి అదేనని కాంగ్రెస్ పేర్కొంది. దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపింది. రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పంద్రాగస్టు సందేశమిచ్చారు. స్వాతంత్ర్యమన్నది రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలతో కూడుకున్న రక్షణ కవచమన్నారు. 'ఇది భావ వ్యక్తీకరణ శక్తి. నిజాలు మాట్లాడే సామర్థ్యం, కలలు నెరవేర్చుకునే ఆశ' అని పేర్కొన్నారు. జై హింద్ అంటూ తన సందేశాన్ని రాహుల్ ముగించారు.

ఐదో వరుసలో రాహుల్ సీటు- మోదీ ప్రభుత్వ సంకుచిత ఆలోచనకు నిదర్శనం: కాంగ్రెస్

స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకొని ఎర్రకోట వద్ద కార్యక్రమానికి ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్ గాంధీ హాజరయ్యారు. రాహుల్‌కు ఐదో వరుసలో స్థానం కేటాయించడం దుమారం రేపింది. ఒలింపిక్స్ విజేతలతో కలిసి కూర్చున్నారు. కేబినెట్ మంత్రులతో సమాన స్థాయిలో ముందు వరుసలో ప్రతిపక్ష నేత సీటు ఉండాలి కానీ రాహుల్‌కు వెనుక వరుసలో సీటు కేటాయించడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని అవమానించారంటూ కేంద్రాన్ని దుయ్యబట్టింది. మోదీ ప్రభుత్వ సంకుచిత బుద్ధికి ఇది నిదర్శనమని వ్యాఖ్యానించింది. రాహుల్ సీటుపై సామాజిక మాధ్యమాల్లోనూ పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. దీనిపై రక్షణ శాఖ వివరణ ఇస్తూ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులకు ముందు వరుసలో సీట్లు కేటాయించడంతో కాంగ్రెస్ ఎంపీలకు వెనక సీట్లు ఇచ్చినట్లు సమర్థించుకుంది. దీనిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందిస్తూ 'మోదీ ఇకనైనా మేల్కోండి. స్వాతంత్ర్య వేడుకల్లో ప్రతిపక్ష నాయకుడికి వెనుక సీటు కేటాయించడం ద్వారా జూన్ 4 తర్వాత పరిణామాల వాస్తవికతను మీరు గ్రహించలేదని, గుణపాఠం నేర్చుకోలేదని స్పష్టమైంది. ఒలింపిక్స్ విజేతల గౌరవార్థమంటూ రక్షణశాఖ ఇచ్చిన వివరణ పేలవంగా ఉంది. పతకాలు సాధించిన క్రీడాకారులు గౌరవనీయులే కానీ అమిత్‌షా లేక నిర్మలా సీతారామన్ వంటి కేంద్ర మంత్రులు వారి కంటే ముందు వరుసలో ఎలా కూర్చున్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఉభయ సభల్లో ప్రతిపక్ష నేతకు ముందు వరుసలో సీటు ఉండాలి. రాహుల్ గాంధీకిగానీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకుగానీ ఆ గౌరవం దక్కలేదు. వారికి ఐదో వరుసలో సీట్లు కేటాయించారు. ఇది విపక్ష నేత హోదాకు, రాహుల్‌కు మాత్రమే కాదు దేశ పౌరులందరికీ అవమానకరం' అని అన్నారు. వాస్తవాలు కొందరినీ ఎంతలా ఇబ్బంది పెడతాయంటే వారు వాటిని ఎదుర్కొనలేక సీట్లే మార్చేస్తారని వేణుగోపాల్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనట్టే స్పందిస్తూ ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక సంప్రదాయాలు, ప్రతిపక్ష నాయకుడి హోదాను మీరు గౌరవించరని తేలిపోయిందని మోదీని ఉద్దేశించి అన్నారు. రాహుల్ ఐదో వరుసలో కాదు 50వ వరుసలో కూర్చున్నాగానీ ఆయన ప్రజా నాయకుడే... ఇలాంటి చిల్లర పనులను మీరెప్పుడు మానుకుంటారు అని 'ఎక్స్'లో శ్రీనట్టే వ్యాఖ్యానించారు.

గొప్పలతోనే సరి

(మొదటిపేజీ తరువాయి)

ఓర్వలేకపోతున్నారు. అలాంటి వారితో మనం అప్రమత్తంగా ఉండాలి. మన విలువలు, చరిత్ర గురించి ప్రపంచానికి తెలియాలి. భారత్ సుసంపన్నత ద్వారానే ప్రపంచ సుసంపన్నత సాధ్యం' అని మోదీ తెలిపారు. అవినీతి నిరోధానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. కుటుంబ రాజకీయాలను అడ్డుకోవాలని, రాజకీయాలతో సంబంధంలేని కుటుంబాల నుంచి కనీసం లక్ష మంది యువత రాజకీయాల్లోకి రావాలని, పంచాయతీ నుంచి పార్లమెంటు స్థాయి వరకు సేవలు అందించాలని అన్నారు. వైద్య పరీక్షల్లో అక్రమాల దృష్ట్యా నీట్ వివాదం క్రమంలో దేశంలోని వైద్యవిద్య కోసం 75వేల సీట్లు పెంచుతున్నట్లు ప్రధాని ప్రకటించారు. 11ఏళ్లలోనే సుదీర్ఘమైన ప్రసంగాన్ని మోదీ చేశారు. దాదాపు 98 నిమిషాలు మాట్లాడారు. గత పదేళ్ల పాలనపై ప్రగతి నివేదికనూ సమర్పించారు. కొత్త క్రిమినల్ చాట్టాలు, పోలీసు కోడ్లతో పాటు తమ ప్రభుత్వ సంస్కరణల గురించీ గొప్పలు చెప్పుకున్నారు. పేదలు, మధ్యతరగతి, వెనుకబడి వర్గాలు, నిరుద్యోగ యువత జీవితాల్లో మార్పు తెచ్చామని, పంచాయతీ నుంచి అన్ని స్థాయిల్లో సంక్షేమమే లక్ష్యంగా మిషన్ మోడ్‌లో ప్రభుత్వం పనిచేస్తోందని ప్రగల్భాలు పలికారు. మేడిన్ ఇండియా చిప్-సెమీకండక్టర్ తయారీ రంగాల్లో తమ ప్రభుత్వానికి అజెండా ఉందని తెలిపారు. నలంద స్ఫూర్తితో శ్రేష్ఠమైన విద్యను అందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. భారత్ ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని, స్వాతంత్ర్యం కోసం 40కోట్లమంది నాడు పోరాడారని.. దేశ జనాభా ప్రస్తుతం 140 కోట్లకు పెరిగిందని చెప్పారు. దేశ పౌరుల కలల సాకారానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కొన్నేళ్లుగా విపత్తులు దేశాన్ని ఇబ్బందిపెట్టాయన్న ఆయన బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను, బంగ్లాదేశ్‌లో హిందువుల పరిస్థితి గురించీ ప్రస్తావించారు. మహిళల భద్రతకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. 'మన తల్లులు, సోదరీమణులు, కుమార్తెలు వేధింపులకు గురవుతున్నారు. ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. అది నాకు తెలుస్తోంది. దేశం, సమాజం, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని తీవ్రంగా పరిగణించాలి. కోల్‌కతా ఘటనపై విచారణ వేగవంతం కావాలి, దోషులను కఠినంగా శిక్షించాలి. ఇటువంటి నేరాలను మీడియా ప్రసారం చేసేటప్పుడు దోషుల పేర్లనూ వెల్లడించి వారు సిగ్గుపడేలా చేయాలి' అని మోదీ అన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఎన్నో సంస్కరణలు తెచ్చామన్నారు.

జల్‌జీవన్ మిషన్ ద్వారా 15కోట్ల మందికి లబ్ధి చేకూరిందన్నారు. భారత్ చిరు ధాన్యాలు ప్రపంచంలోని అందరికీ చేరాలని భారీ సంస్కరణలు తెచ్చేందుకు సంకల్పించినట్లు తెలిపారు. దేశాభివృద్ధికి నూతన ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఉపాధి కల్పనలో గణనీయమైన ప్రగతి సాధించామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మోదీ చెప్పారు. గత దశాబ్దంలో మౌలిక సదుపాయాలలో అపూర్వమైన అభివృద్ధి జరిగిందని, ప్రతి గ్రామంలో పాఠశాలలు నిర్మించడం, రోడ్లు, పోర్టులు, రైల్వేలు, వైద్య కళాశాలలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం, అమృత్ సరోవర్ వంటి కాలువల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు కోట్ల మంది పేదలకు ఇళ్లు కట్టి ఇచ్చేందుకు తమ ప్రభుత్వం కసరత్తు చేస్తోందని మోదీ వెల్లడించారు.

స్ఫూర్తిదాయకమేమీ లేదు

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కారంలో విఫలమవుతారు. దేశంలో ఏకసారూప్యత ఆపాదించాలని చూస్తున్నారు' అని రాజా వ్యాఖ్యానించారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక చేసిన ఆరోపణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పలేదన్నారు. 'హిండెన్‌బర్గ్ ఆరోపణలపై ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు? సెబీతో పాటు అన్ని సంస్థలు నిర్వీర్యమవుతున్నాయి. ఎన్నికల కమిషన్‌నూ ముందే నీరుగార్చారు. వాస్తవ సమస్యల్లో దేనిని ప్రస్తావించలేదు' అని రాజా వ్యాఖ్యానించారు. సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు, ఎన్ఎఫ్ఐడబ్ల్యు ప్రధాన కార్యదర్శి అనీరాజా కూడా ప్రధాని ప్రసంగాన్ని ఖండించారు. ఒక దేశం, ఒక ఎన్నిక ఆలోచనను ప్రశ్నించారు. 'ఒక దేశం, ఒక ఎన్నిక అంటే ఏమిటి? 2047 నాటికి దేశాన్ని ఆర్థిక శక్తిగా చేస్తాని చెప్పడంతో ఉన్న ఆత్మవిశ్వాసం దేశంలో వేర్వేరు సమయాల్లో ఎన్నికలు జరగవచ్చు అని చెప్పేందుకు ఎందుకు లేదు? ఎన్నికల కోసం వనరులను ఈ దేశం సృష్టించలేనప్పుడు.... 2047 గురించి మాట్లాడటంలో అర్థంలేదు. ఒక దేశం, ఒక ఎన్నిక మర్మమేమిటో అంతు పట్టడంలేదు' అని అనీరాజా వ్యాఖ్యానించారు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడమే మొదటి అజెండాగా ఉండాదని ప్రధాని మోదీకి ఆమె హితవు పలికారు.

అర్ధరాత్రి రోడ్లపైకి మహిళలు

(మొదటిపేజీ తరువాయి)

విచారణకు డిమాండ్ చేస్తున్నాం' అని మొండల్ చెప్పారు.

అవాస్తవాలు ప్రచారం చేయొద్దు: పోలీసుల హెచ్చరిక

నిరసనల్లో ఘటనాస్థలం ధ్వంసం అయినట్లు వచ్చిన వార్తలను కోల్‌కతా పోలీసులు ఖండించారు. ఉదంతాలు నమ్మవద్దని సూచించారు. 'క్రైమ్ సీన్ అయిన సెమినార్ హాల్‌ను ఎవరూ తాకలేదు. అవాస్తవాలు ప్రచారం చేయొద్దు. అబద్ధపు ప్రచారం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం' అని 'ఎక్స్'లో పోలీసులు హెచ్చరించారు.

ఆర్జీ కార్ ఆసుపత్రిని సందర్శించిన బెంగాల్ గవర్నర్

వైద్యురాలిపై అత్యాచారం, హత్య జరిగిన కోల్‌కతాలోని ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిని బెంగాల్ గవర్నర్ ఆనంద్ బోస్ సందర్శించారు. వైద్యులు, విద్యార్థులతో మాట్లాడారు. తప్పక న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. వైద్యుల పోరాటానికి మద్దతు తెలిపారు. గెలుపు మనదే అని అన్నారు. అండగా ఉంటామని హామీనిచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు తాను మీ వెన్నంటి నిలుస్తానని హామీ ఇచ్చారు. సమిష్టి కార్యాచరణతో ముందుకెళితే వీటిని అడ్డుకోగలుగమని గవర్నర్ తెలిపారు.

మహిళల భద్రతకు పటిష్ఠ చర్యలేవి: అనీరాజా

న్యూఢిల్లీ: మహిళల భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకునేది ఎప్పు డని సీపీఐ నాయకులు అనీరాజా ప్రశ్నించారు. బెంగాల్ పరిణామాలపై ఆందోళన వ్యక్తంచేశారు. కోల్‌కతా ఆసుపత్రిపై మూకదాడిని ఖండించారు. రాజకీయ నిందాక్రీడలు మాని మహిళలకు భద్రత కల్పించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. 'గత రాత్రి జరిగిన మూక హింసను ఖండిస్తున్నా. దానిని నివారించాల్సింది ఎవరు? శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యత ఎవరిది? రాష్ట్ర ప్రభుత్వానిది కాదా' అని అనీరాజా ప్రశ్నించారు. తాజా పరిణామాల దృష్ట్యా ఆసుపత్రి భద్రతకు చర్యలు తీసుకోవాల్సిందన్నారు. 'అత్యాచారాలు జరిగితే రాజకీయ నిందాక్రీడ మొదలవుతుంది. కొన్ని రోజుల్లో అంతా సర్దుమణిగిపోతుంది. మళ్లీ ఎవరైన మహిళపై అత్యాచారం జరిగితే కథ మొదటికి వస్తుంది. ఈ దేశంలో మహిళలకు సమ పౌరసత్వం, సమ న్యాయం ఉండేందుకు నిబద్ధత కలిగిన వారు లేరు. రాజకీయాలు మానేసి మహిళలకు భద్రతకు పటిష్ఠ చర్యలపై ప్రతి రాజకీయ పార్టీ దృష్టి పెట్టేంత వరకు ఈ సమస్యకు పరిష్కారం లభించదు' అని అనీరాజా అన్నారు.

దీదీ...మీ నుంచి ఇది ఆశించలేదు: స్వాతి మలివాల్

న్యూఢిల్లీ: మహిళలకు రక్షణ కల్పించడానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ కోరారు. కోల్‌కతాలో వైద్యురాలి ఉదంతంపై మమతకు ఒక లేఖ రాశారు. 'దీదీ... మీరు ఏకైక మహిళా ముఖ్యమంత్రి. మీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. ఎన్నికల్లో మహిళా అభ్యర్థులను ఎక్కువగా నిలబెడతారని మీకు పేరుంది. అనేకమంది మహిళా ఎంపీలు ఉన్నారు. అయినప్పటికీ తాజా వ్యవహారంలో మీ ప్రభుత్వ వైఖరి ఆందోళన కలిగిస్తోంది. ఇంతటి హేయమైన నేరం జరిగితే బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తుండటమే కాకుండా మీ పార్టీ మౌనం వహించడం కలచివేస్తోంది. గతంలోనూ బెంగాల్‌లో ఇలాంటివి జరిగాయి. మీ ప్రభుత్వ మౌనం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. దేశం స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటోంది కానీ మాలో ఆనందం లేదు. ఈ ఘటన సమాజంలోని పాశవికతకు అద్దం పడుతోంది. దేశంలో మహిళలకు స్వేచ్ఛ లేకపోవడమే కాకుండా అత్యాచారాలు, హత్యల భయం వెంటాడుతోంది. ఈ పరిస్థితుల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఎలా జరుపుకోగలం. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నాం' అని మలివాల్ పేర్కొన్నారు.

ఆశావహులు అనంతం

(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీరాజ్, అటవీశాఖలను ఆయనకు కట్టబెట్టారు. అలానే దామాషా ప్రకారం నామినేటెడ్ పదవులను జనసేన, బీజేపీ నేతలకు కేటాయించనున్నారు. ఈ క్రమంలో వీలైనంత త్వరగా ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. అందులో భాగంగా టీడీపీ అధిష్ఠానం నామినేటెడ్ పదవుల కోసం ఆశావహుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తోంది. అయితే పార్టీ పట్ల అంకిత భావంతో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తోంది. ప్రధానంగా పొత్తులో భాగంగా జనసేనకు 21, బీజేపీకి 10 స్థానాలు కేటాయించడంతో ఆయా నియోజకవర్గాల్లోని టీడీపీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు సీట్లను త్యాగం చేశారు. అంతే కాకుండా సుమారు 50 స్థానాల్లో కొత్త అభ్యర్థులకు టీడీపీ సీట్లు ఇచ్చింది. ఈ క్రమంలో ఆ నియోజకవర్గ సీనియర్ నేతలకు ఎన్నికల సమయంలో నామినేటెడ్ పదవులు ఇస్తామని పార్టీ అధిష్ఠానం హామీ ఇచ్చింది. దీంతో సీటు త్యాగం చేసిన నేతలకు అవకాశం ఇస్తారా లేక ఆ నియోజకవర్గంలో పార్టీ కోసం పోరాడి కేసులు ఎదుర్కొన్న వారికి ఇస్తారా అనేది చర్చనీయాంశంగా ఉంది. ఉదాహరణకు మైలవరంలో ఎన్నికల ముందు పార్టీలో చేరిన వసంత కృష్ణ ప్రసాద్ కోసం మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు టికెట్ ఇవ్వలేదు. అలానే పవన్ కల్యాణ్ పోటీ చేసిన పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే వర్మ సీటు త్యాగం చేశారు. నాదెండ్ల మనోహర్ కోసం సీనియర్ నేత ఆలపాటి రాజాకు టీడీపీ టికెట్ ఇవ్వలేదు. ఇలా చాలా మంది సీనియర్ నేతలు నామినేటెడ్ పదవులపై ఆశతో ఉన్నారు. పదవులేమో స్వల్ప సంఖ్యలోనే ఉన్నాయి. ఆశావహులు మాత్రం వేలల్లో ఉన్నారు. గత నెల రోజుల వ్యవధిలోనే టీడీపీకి దాదాపు 22 వేల దరఖాస్తులు వచ్చాయి. వీటిపై ప్రస్తుతం మదింపు జరుగుతోంది. నేతల అంచనాలకు తగ్గట్టుగానే మరికొద్ది రోజుల్లో నామినేటెడ్ పదవులను ఇచ్చేందుకు ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపట్టేందుకు చంద్రబాబు కసరత్తు నిర్వహిస్తున్నారు. అయితే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), ఏపీఐఐసీ, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ వంటి కీలక పదవులకు పోటీ తీవ్రంగా ఉంది.

ఆడబిడ్డల భద్రతకే ప్రాధాన్యం

- రాష్ట్ర పునర్నిర్మాణానికి అడుగులు
- శాంతిభద్రతలు పటిష్ఠంగా అమలు
- మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం
- అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు
- స్వాతంత్ర్య వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పవన్

విశాలాంధ్రబ్యూరో-కాకినాడ: 'ఇంటి నుంచి బయటకు వెళ్లిన ప్రతి ఆడబిడ్డ భద్రంగా ఇంటికి తిరిగి రావాలి. దోపిడీలు, దౌర్జన్యాలు నశించే రోజులు సాకారం కావాలి. శాంతిభద్రతలు బలంగా అమలు జరగాలి. యువ శక్తిని నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ ఆవిష్కృతం అవ్వాలి. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలి. పెట్టుబడులకు రాష్ట్రం స్వర్గసీమగా విరాజిల్లాలి. అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి ఆటంకాలు లేకుండా ముందుకు సాగాలి... ఇవే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యాలు' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చిన అధికార బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ, వారు పెట్టుకున్న నమ్మకాన్ని కచ్చితంగా నెరవేర్చుతామన్నారు. కాకినాడలో గురువారం నిర్వహించిన 78వ స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, జిల్లా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పవన్ మాట్లాడుతూ... దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌కు అభివృద్ధిలో బ్రాండ్ ఇమేజ్ తీసుకొచ్చేలా అన్ని విధాలా పాలనలో మార్పు తీసుకొస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా అతలాకుతలం అయిన రాష్ట్రానికి జీవం పోసేలా చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజాధనాన్ని అక్రమంగా దోచుకున్న వారికి చట్ట ప్రకారం శిక్షపడాలని పేర్కొన్నారు. మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వంటి దార్శనికుడి పాలనతో భారతదేశం ప్రయాణాన్ని మొదలుపెడితే అంతే సమర్థంగా పాలించిన లాల్ బహదూర్ శాస్త్రి, అపర దుర్గగా పేరుగాంచిన ఇందిరా గాంధీ, ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని బయటకు తీసుకొచ్చిన గొప్ప నేత పీవీ నరసింహారావు, పోఖ్రాన్‌లో అణు బాంబు పరీక్ష చేసి శత్రు దేశాలకు వెన్నులో వణుకు పుట్టించిన అటల్ బిహారీ వాజ్ పేయి, దేశంపై దాడి చేస్తే ... అదే తరహాలో బుద్ధి చెబుతామని నిరూపించిన ప్రధాని నరేంద్ర మోదీ వరకు ఈ దేశం ఎందరో గొప్ప నేతలను చూసిందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఎందరో త్యాగధనులను గుర్తు చేసుకోవాల్సిన సమయమన్నారు.

సూపర్ సిక్స్ అమలుతోపాటు రాష్ట్ర పునర్నిర్మాణానికి షణ్ముఖ వ్యూహంతో ముందుకు వెళుతున్నామన్నారు. కాకినాడ జిల్లాలో 17 కేటగిరిల్లో 2,77,594 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నాం. ఆంధ్రుల అన్నపూర్ణగా భావించే డొక్కా సీతమ్మ పథకంతో జిల్లాలోని 1,258 పాఠశాలల్లోని పిల్లలకు మధ్యాహ్న భోజనం అందజేస్తున్నాం. అన్న క్యాంటీన్లను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించి పేదలకు ఐదు రూపాయలకే భోజనం అందించే కార్యక్రమం మొదలుపెట్టాం. ఇసుక విధానంలో మార్పులు చేసి, ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంలో భాగంగా యూనిట్‌కు రూ.4 లక్షలు అందజేస్తాం. పెండింగ్‌లో రూ.49 కోట్లు బిల్లులు చెల్లించే ఏర్పాటు చేస్తాం. జిల్లాలో 37 కౌంటర్లలో ప్రజలకు నిత్యావసర వస్తువులను తక్కువ ధరకే అందిస్తున్నామని వివరించారు.

పంచాయతీరాజ్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి కల్పిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని 13,326 పంచాయతీల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా మంచినీటి పథకం అమలుకు జల్ జీవన్ మిషన్ నిధులను వినియోగిస్తామన్నారు. యువతకు నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించి ఉపాధి అవకాశాలు సృష్టిస్తామన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలనేది లక్ష్యమన్నారు. రాష్ట్రంలో బలంగా శాంతిభద్రతలు ఉంటేనే పెట్టుబడులు వస్తాయి. ఉపాధీ పెరుగుతుందన్నారు. టూరిజం, వైద్యం, పరిశ్రమల రంగంపై దృష్టి పెట్టడం ద్వారా ఉపాధిని పెంపొందించవచ్చన్నారు. లక్ష మంది యువ సేంద్రీయ రైతులను తయారు చేయాలనే ఆలోచన ఉందన్నారు. గత ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్నారు. సోషల్ మీడియాలో మహిళలను కించపరిచేలా మాట్లాడే వారిపై నిఘాపెడతామన్నారు. ఆడబిడ్డలపై వేధింపులకు పాల్పడే వారిని వదిలే ప్రసక్తి లేదన్నారు. రాజమండ్రి నుంచి కాకినాడ ఏడీబీ రోడ్డు నిర్మాణానికి రూ.390 కోట్ల ఖర్చు అవుతుంది. దీనివల్ల ఎందరికో మేలు జరుగుతుంది. ప్రయాణ సమయం తగ్గుతుంది. కానీ ఈ పనులను గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఉప ముఖ్యమంత్రి విమర్శించారు. రూ.650 కోట్లు ఖర్చు చేసి రుషికొండలో కోటను నిర్మించారు గాని ప్రజలకు అవసరమైన విషయాలపై గత ప్రభుత్వం దృష్టి సారించ లేదన్నారు. ఏడీబీ రోడ్డు సమస్యను పరిష్కరించేలా చొరవ తీసుకుంటామన్నారు. శేషాచలంలో రూ.140 కోట్ల విలువైన ఎర్రచందనంను స్మగ్లర్లు అక్రమంగా తీసుకెళుతుండగా కర్నాటక పోలీసులు పట్టుకుంటే కనీసం దాన్ని తిరిగి రాష్ట్రానికి తీసుకొచ్చే చర్యలు గత ప్రభుత్వం తీసుకోలేదన్నారు. జల్ జీవన్ మిషన్ నిధుల్లో అపారమైన అవినీతి జరిగిందన్నారు. ప్రజాధనాన్ని దోచుకున్న వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు.

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి

విశాలాంధ్ర జీఎం హరినాథరెడ్డి

విశాలాంధ్ర- మధురవాడ (విశాఖ): ఎంతోమంది త్యాగాలతో సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలు నేటికీ అందరికీ అందడం లేదని...ఇందుకోసం మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఉదయం విశాలాంధ్ర విశాఖపట్నం ఎడిషన్ కార్యాలయం మారికవలసలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎంతోమంది మహనీయుల త్యాగఫలంతో సాధించుకున్న స్వాతంత్ర్యం నేడు కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయిందని, విదేశీ కంపెనీల పెత్తనం దేశంపై పెరిగిపోయిందని, మహనీయులు ఆశించిన సామాజిక, రాజకీయ, ఆర్థిక స్వేచ్ఛ దక్కడం లేదని, వాటి కోసం మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సి ఉందని చెప్పారు. బ్రిటిష్ వలస పాలనలో చితికిపోయిన దేశాన్ని మోదీ ప్రభుత్వం మళ్లీ కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెడుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కట్టబెట్టాలని కుట్ర చేస్తోందని మండిపడ్డారు. దేశంలో నిరుద్యోగం, ధరలు పెరిగి ప్రజల జీవనం చిన్నాభిన్నమవుతోందని... అందరికీ స్వాతంత్ర్య ఫలాలు అందడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర విజ్ఞాన సమితి పాలకవర్గ సభ్యులు, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ పి.కామేశ్వరరావు, విశాలాంధ్ర డీజీఎం మనోహర్‌నాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా సీపీఐ కార్యదర్శి కూరంగి మన్మధరావు, విశాఖ ఎడిషన్ మేనేజర్ నర్సింహులు, విశాఖపట్నం బ్యూరో పి.రామకృష్ణ, శ్రీకాకుళం జిల్లా బ్యూరో సనపల రమేశ్, మధురవాడ ఏరియా సీపీఐ కార్యదర్శి వాంద్రాసి సత్యనారాయణ, నాయకులు జి.వేలంగిణిరావు, బంగారయ్య, రిపోర్టర్లు, సబ్ ఎడిటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శకటాల ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా శుక్రవారం విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో జరిగిన వేడుకల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న అలంకృత శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధతను ప్రతిబింబించేలా రూపొందిన శకటాలను నగర ప్రజలు తిలకించేందుకు వేడుకల అనంతరం ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానం నుంచి బెంజ్ సర్కిల్, రామవరప్పాడు రింగ్, విజయా టాకీస్, ఓల్డ్ బస్టాండ్, రాఘవయ్య పార్కు, డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహం తదితర ప్రాంతాల మీదుగా ప్రదర్శించారు. ఈ వేడుకల్లో వ్యవసాయ శాఖ, పశుసంవర్థక శాఖ, మహిళాభివృద్ధి, పాఠశాల విద్య.. వైద్య ఆరోగ్య శాఖ, సెర్ప్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, పరిశ్రమలు, గృహ నిర్మాణం-టిడ్కో, సీఆర్‌డీఏ, శకటాలను ప్రదర్శించగా, పాఠశాల విద్యా శాఖ, పశు సంవర్థక శాఖ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ శకటాలు తొలి మూడు స్థానాల్లో నిలిచాయని అధికారులు వెల్లడించారు.

పేదల మనిషి బత్తుల

సంస్మరణ సభలో జల్లి విల్సన్

విశాలాంధ్ర -నూజివీడు: పేదల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం పోరాడిన ధన్యజీవి బత్తుల వెంకటేశ్వరరావు అనీ, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కమ్యూనిస్టు సంసిద్ధులు కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లివిల్సన్ అన్నారు. ఈ నెల 5వ తేదీన ఆకస్మికంగా మృతి చెందిన నూజివీడు నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు సంస్మరణ సభ గురువారం నూజివీడు మండలం దిగవల్లి గ్రామంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగింది. జల్లి విల్సన్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పార్టీ కోసం కమ్యూనిస్టు విలువలను కాపాడుతూ ప్రజల మనిషిగా ఎదిగిన బత్తుల ఆకస్మిక మృతి విచారకరమన్నారు. నూజివీడు ప్రాంతంలో అటవీ బంజరుల భూ పోరాటాల్లో బత్తుల పాత్ర మరువలేనిదని, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడి నుంచి నియోజకవర్గ పార్టీ కార్యదర్శిగా ఎదిగిన బత్తుల జీవితం ముందు తరాలకు ఆదర్శనీయమన్నారు. రాజకీయ విలువలు దిగజారుతున్న నేటి రోజుల్లో పేదవాడికి న్యాయం చేయడం కోసం వెంకటేశ్వరరావు వంటి నాయకులు ఎంతో అవసరం అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు నిబద్ధతతో పనిచేసిన కమ్యూనిస్టు బత్తుల వెంకటేశ్వరరావు అన్నారు. రాజకీయ కక్షలతో జైలు జీవితాన్ని గడిపినా బెదరకుండా ఎన్ని సమస్యలు ఎదురైనా పార్టీ మాట మీరకుండా కమ్యూనిస్టు జెండాను మోసిన వెంకటేశ్వరరావు ఆదర్శనీయుడు అన్నారు. నిత్యం సాగుదారుల సమస్యల పరిష్కారం కోసం, పేద రైతుల భూ హక్కుల కోసం ఉద్యమించిన వెంకటేశ్వరరావు వంటి నాయకులు కమ్యూనిస్టు ఉద్యమానికి అవసరమని వనజ పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ జనం కోసం పనిచేసిన బత్తుల ప్రజల మనసులో నిలిచిపోతారన్నారు. సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్థిక రాజకీయ ప్రయోజనాలు ఆశించకుండా కమ్యూనిస్టు ఉద్యమానికి నిబద్ధతతో పనిచేసి నాయకుడిగా ఎదిగిన వ్యక్తి బత్తుల వెంకటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నాయకులు హరినాథ్, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా సీపీఐ నాయకులు నార్ల వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు జి రాజు, జనసేన నాయకులు మరీదు శివరామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చిలుకూరు వెంకటేశ్వరరావు, నూజివీడు పట్టణ సీపీఐ కార్యదర్శి చాట్ల పుల్లారావు, రైతు సంఘం నాయకులు రాయంకుల లక్ష్మణరావు, మడుపల్లి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి సర్పంచ్‌కు జాతీయ అవార్డు

విశాలాంధ్ర-చల్లపల్లి: కృష్ణాజిల్లా చల్లపల్లి గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి జాతీయ స్థాయిలో గుర్తింపు, సత్కారం అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేస్తూ ఓడిఎఫ్ ప్లస్ సాధన, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నియంత్రణ, క్లీన్ అండ్ గ్రీన్, గుడ్ గవర్నెన్స్ విభాగాల్లో చల్లపల్లి పంచాయతీని ముందువరుసలో నిలిపినందుకు ఈ గుర్తింపు సాధించారు. ఢిల్లీలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతులమీదుగా సర్పంచ్ కృష్ణకుమారి జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ పురస్కారానికి దేశం మొత్తం మీద ఎనిమిది మంది సర్పంచులు మాత్రమే ఎంపిక కాగా, వారిలో చల్లపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ఒకరు కావటం విశేషం.

టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రతి భారతీయుడు నేడు స్వేచ్ఛ, స్వాతంత్ర వాయువులు పీల్చుకుంటున్నారంటే ఎంతో మంది స్వాతంత్ర సమరయోధుల ప్రాణత్యాగాల ఫలితమేనని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో 78వ స్వాతంత్రదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత పల్లా శ్రీనివాస్ యాదవ్ జాతీయ జెండ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను కొనియాడారు. గుర్తు చేశారు. ఎన్టీఆర్ ఆశయాలతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు దూరదృష్టి, ఆలోచన విధానాలతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లుతుందని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్ధన్, వర్ల రామయ్య, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, జాతీయ అధికార ప్రతినిధి గురజాల మాల్యాద్రి, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తాద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

స్వరాజ్యం, స్వపరిపాలన భారతీయుల జన్మహక్కు

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర హైకోర్టు ఆవరణలో 78వ స్వాతంత్ర్య వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. జస్టిస్ ఠాకూర్ మాట్లాడుతూ స్వరాజ్యం, స్వపరిపాలన భారతీయుల జన్మహక్కు అంటూ స్వాతంత్ర్య సాధన కోసం ఎంతో మంది తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వలస వాదుల పాలన నుంచి భారత దేశానికి విముక్తి కలిగించారన్నారు. నేడు అలాంటి మహానుభావుల అందరినీ స్మరించుకుంటూ శిరస్సు వంచి ప్రణామాలు చేయాల్సిన శుభదినమన్నారు. వారి దేశభక్తి, జాతీయవాదం ప్రస్తుతం రానున్న తరాలవారికి ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. దేశ సమైఖ్యతను, సమగ్రతను కాపాడేందుకు సరిహద్దుల్లో నిరంతరం పాటుపడుతున్న సాయుధ దళాల సేవలకు మనం ఎల్లవేళలా కృతజ్ఞులై ఉండాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. రాజ్యాంగంలో పొందుపర్చిన విధంగా దేశ ప్రజలందరికీ న్యాయం, సమానత్వం, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అందజేయాలనే లక్ష్యంలో భాగంగా న్యాయ వ్యవస్థ ఎంతగానో కృషిచేస్తోందన్నారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎన్.ద్వారకానాథ్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తులు, కుటుంబ సభ్యులు, అదనపు అడ్వకేట్ జనరల్ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనతోనే సమసమాజ స్థాపన

శాసన మండలి చైర్మన్ మోషెన్‌రాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సమాజంలో పేదరిక నిర్మూలకు ప్రభుత్వాలు అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలు పూర్తిగా క్షేత్రస్థాయిలో పేదలందరికీ అందినపుడే సమసమాజ స్థాపన జరుగుతుందని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అసెంబ్లీ భవనం వద్ద జరిగిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ముందుగా రాష్ట్ర ప్రజలందరికీ స్వాంతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, ఉప కార్యదర్శులు పీవీ సుబ్బారెడ్డి, రాజకుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

ఉభయ సభల్లో ఫలవంతమైన చర్చలు జరగాలి

అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ఉభయ సభల్లో ప్రజా సమస్యలపై అర్ధవంతమైన, ఫలవంతమైన చర్చలు జరగాలని, అప్పుడే ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనాలైన చట్ట సభలకు మరింత గౌరవం పెరుగుతుందని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్ర శాసనసభ వద్ద జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మువ్వన్నెల జాతీయ పతాకావిష్కరణ చేశారు. రాజధానిలో 78వ స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ముందుగా రాష్ట్ర ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

భారతీయుడి హృదయం గర్వంతో నిండే రోజు: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రతి భారతీయుడి హృదయం గర్వంతో నిండే రోజు స్వాతంత్ర్య దినోత్సవం అని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది బానిస సంకెళ్లను తెంచుకున్న రోజు, మనందరికీ స్వేచ్ఛా వాయువులు పంచిన రోజు అని, రాష్ట్ర ప్రజలందరికీ జగన్ 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో ట్వీట్ చేస్తూ...స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధులందరికీ మనస్ఫూర్తిగా నివాళు లర్పించారు.

కాగా, తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జాతీయ జెండాను జగన్ ఎగురవేశారు. తొలుత పార్టీ నేతలతో కలిసి మహాత్మాగాంధీ చిత్రపటానికి జగన్ పూలమాలలేసి నివాళులర్పించారు. శాసనమండలి ప్రతిపక్ష నేత లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, విడదల రజని, కారుమూరి నాగేశ్వరరావు, మెరుగు నాగార్జున, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, మాజీ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంత్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు మల్లాది విష్ణు, నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

యువతకు మేజర్ రాంగోపాల్ స్ఫూర్తి

కీర్తిచక్ర పురస్కారం సంతోషాన్నిచ్చింది: డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మేజర్ మళ్ల రాంగోపాల్ నాయుడు కీర్తిచక్ర పురస్కారానికి ఎంపిక కావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశ రక్షణలో అత్యంత ధైర్య సాహసాలతో విశిష్ట సేవలందిస్తున్న రాంగోపాల్ నాయుడికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. దేశ సరిహద్దుల్లో నియంత్రణ రేఖ వద్ద ఉగ్రవాదులతో చేసిన పోరాటం అసామాన్యమైనదని అన్నారు. ప్రాణాలకు తెగించి బాంబు దాడులను తప్పించుకొని తన వెంట ఉన్న సైనిక బృందాన్ని రక్షించుకున్న విధానం ఆయన పోరాట పటిమను తెలుపుతోందని పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం నరిగిపెంట గ్రామానికి చెందిన ఆయన యువతకు స్ఫూర్తిగా నిలుస్తారని పవన్ అన్నారు.

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి

రవీంద్రనాథ్

విశాలాంధ్ర-విజయవాడ: స్వాతంత్ర్య ఫలాలు ప్రజలందరికీ అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. 78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా గొల్లపూడి సిరి ఎన్‌క్లేవ్‌లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచిన స్వాతంత్ర్య ఫలితాలు అందరికి అందించడంలో పాలకవర్గాలు ఘోరంగా విఫలమయ్యారన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్ని తరిమికొట్టి దేశాన్ని మనమే పరిపాలించుకుంటున్నప్పటికీ దేశ సంపద కొన్ని వర్గాల చేతిలో కేంద్రీకృతమై ఉండటం వల్ల ఆశించిన ఫలితాలు అందరికీ దక్కటం లేదని ఆవేదన వెలిబుచ్చారు.అంతకుముందు జాతీయ పతాకాన్ని అపార్ట్‌మెంట్ అధ్యక్షులు కట్టా రాంప్రసాద్ ఆవిష్కరించగా కార్యదర్శి ఎస్‌వీ చౌదరి కార్యక్రమ ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ రంగారావు, వెంకట్, సాంబశివరావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

18న జీ తెలుగులో శ్రావణలక్ష్మి, ప్రేమలు ప్రసారం

విశాలాంధ్ర-కడప: ఆదోని వేదికగా నిర్వహించిన జీ తెలుగు మెగా ఈవెంట్ 'శ్రావణలక్ష్మి' ఈ నెల 18వ తేది మధ్యాహ్నం 12 గంటలకు ప్రసారమౌతుందని సంస్థ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సరికొత్త సినిమాలతో అలరించే జీ తెలుగు ఈవారం మరో సూపర్ హిట్ సినిమా 'ప్రేమలు' వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా అందించేందుకు సిద్ధమైందన్నారు. నస్లెన్ కే గఫూర్, మమితా బైజు నటించిన ప్రేమలు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ అదే రోజు సాయంత్రం 5.30 కు ప్రసారమవుతుందన్నారు. జీ తెలుగు ఇటీవల ఆదోనిలో ప్రముఖ నటీనటులతో శ్రావణమాసం ప్రత్యేక కార్యక్రమం 'శ్రావణలక్ష్మి' మెగా ఈవెంట్ నిర్వహించి వీక్షకులకు ఆహ్లాదకరమైన అనుభవాన్ని అందించిందన్నారు. ప్రేక్షకులను మెప్పిస్తూ విజయవంతంగా కొనసాగుతున్న జాబిల్లికోసం ఆకాశమల్లే, మా అన్నయ్య సీరియల్స్ నటీనటులు ఈ వేదికపై నుంచి తమ అభిమానులతో సంభాషించి వారి సంతోషంలో పాలుపంచుకున్నారన్నారు.

విట్ ఉద్యోగులకు సత్కారం

వివిధ శాఖల సిబ్బందికి నగదు పురస్కారాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విట్ వర్సిటీలో గురువారం స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డెల్ టెక్నాలజీస్ (బెంగళూరు) వైస్ ప్రెసిడెంట్ ఇలవరసు కృష్ణన్ జాతీయ జెండా ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, అయిదుగురు మున్సిపల్ వర్కర్స్, ఇద్దరు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి విట్ ఆధ్వర్యంలో రూ.25వేల నగదు పురస్కారంతో పాటు జ్ఞాపికలను అందజేశారు. వర్సిటీలో సేవలు అందిస్తున్న 31 మంది క్లీనింగ్ , సెక్యూరిటీ సిబ్బందిని సత్కరించారు. విట్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్‌వీ కోటరెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్ చంద్ర ముడిగంటి, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే ఖాదిర్ పాషా పాల్గొన్నారు.

సంపాదకీయం

మోదీ మతతత్వ విరాడ్రూపం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరసగా పదకొండోసారి స్వాంతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రసంగిస్తూ షరా మామూలుగా బీజేపీ, ఆర్.ఎస్.ఎస్. భావజాలాన్ని మరోసారి గట్టిగా ప్రతిపాదించారు. అందులో ప్రధానమంత్రి ఉమ్మడి వివాహ చట్టం ఉండాలన్నది. ఈ విషయంపై సుదీర్ఘంగా చర్చ జరుగుతోంది. రాజ్యాంగ రూపకల్పన సమయంలోనే ఈ అంశంపై వాడిగా చర్చ జరిగింది. కానీ అనేక అవాంతరాలు ఉన్నందువల్ల దీన్ని రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో చేర్చారు. బీజేపీకి పూర్వ రూపమైన భారతీయ జనసంఘ్ కూడా నిరంతరం ఉమ్మడి వివాహచట్టం గురించి ప్రస్తావించేది. అలాంటి వివాహ చట్టం దేశంలో అమలు చేయాలన్నది బీజేపీ మాతృ సంస్థ ఆర్.ఎస్.ఎస్. ప్రధాన లక్ష్యం. ఉమ్మడి వివాహ చట్టం అమలు చేయాలన్న లక్ష్యంపై ఎవరికీ అభ్యంతరాలు ఉండనవసరం లేదు. కానీ అందులో ఇమిడిఉన్న సమస్యలే ఇప్పటిదాకా అది అమలు చేయడానికి ఆటంకాలుగా ఉన్నాయి. మోదీ, బీజేపీ, ఆర్.ఎస్.ఎస్. కోరుతున్న ఉమ్మడి వివాహ చట్టం అసలు లక్ష్యం అందరికీ వర్తించే వివాహ చట్టం అమలు చేయడంకాదు. వివిధ మైనారిటీ మతాలు, ముఖ్యంగా ముస్లిం మతస్థుల సంప్రదాయాలకు భంగం కలిగించడమే. గత 75 ఏళ్లుగా అమలులో ఉన్న వివాహ చట్టం మతతత్వంతో కూడుకున్నదనీ దానిబదులు సెక్యులర్ వివాహ చట్టం కావాలని మోదీ అంటున్నారు. ఇది ఆయన చేసే అసత్య ప్రచారంలో భాగమే. సుప్రీంకోర్టులో ఉమ్మడి వివాహ చట్టం అనేకసార్లు చర్చకు వచ్చిందనీ, ఇప్పుడున్నది మతతత్వ వివాహ చట్టం అని చెప్పిన వాక్యంలో మొదటి భాగం సత్యమైతే రెండో భాగం పూర్తిగా అసత్యం. ప్రస్తుత వివాహచట్టం వివక్ష చూపుతోందని ఆయన అంటున్నారు. ఆధునిక సమాజంలో మతంమీద ఆధారపడ్డ వివాహ చట్టాలు ఉండకూడదని తాను గొప్ప ఆధునిక భావాలు కలవాడినని నిరూపించుకోవడానికి వ్యర్థ ప్రయత్నం చేశారు. ప్రస్తుత వివాహ చట్టం వివక్షాపూరితమైందని ప్రజలు భావిస్తున్నారని సంఘ్ పరివార్ వాదనను ప్రజల మీదకు తోసేశారు. 21వ లా కమిషన్ సంప్రదింపుల పత్రంలో వివక్షాపూరితమైన చట్టాల గురించి లోతుగా చర్చించింది. అయితే ఈ దశలో ఉమ్మడి వివాహ చట్టం తీసుకురావడం అనవసరం అని కూడా గట్టిగా అభిప్రాయపడింది. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరాఖండ్ లో ఉమ్మడి వివాహ చట్టం తెచ్చినప్పుడు తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైన వాస్తవాన్ని మోదీ వాటంగా విస్మరించారు. ప్రస్తుతం ఉన్న వివాహ చట్టం మతతత్వంతో కూడినది అన్న మోదీ మాటలు నిజానికి రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడు డా. బి.ఆర్.అంబేద్కర్ ను అవమానించడమే. ప్రధానమంత్రి మోదీ "ఒకే దేశం-ఒకే ఎన్నికలు" అన్న నినాదాన్ని స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో భుజాన వేసుకున్నారు. దీని మీదా బోలెడు చర్చ జరిగింది. దేశమంతటా ఒకసారి ఎన్నికలు జరగాలి అంటే లోక్‌సభ ఎన్నికలతోపాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకూ ఎన్నికలూ జరిగాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత సుమారు రెండు దశాబ్దాల పాటు ఇదే పద్ధతి కొనసాగింది. ఒక్కసారి కేరళలో మినహా అప్పుడు దేశమంతటా లోక్‌సభకు, రాష్ట్రాల శాసన సభలు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. 1956లో కేరళలో నంబూద్రిపాద్ నాయకత్వంలోని కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన తరవాత అక్కడ ఉప ఎన్నికలు జరపాల్సి వచ్చింది. 1967లో ఉత్తరాదిలోని తొమ్మిది రాష్ట్రాలలో ప్రతిపక్షాలు విజయం సాధించడంతో కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యానికి ఎదురు దెబ్బ తగిలింది. ఈ తొమ్మిది రాష్ట్రాలలో ప్రతిపక్షాల ఐక్య కూటమి ప్రభుత్వాలు ఏర్పాటు చేసింది. వాటిని సంయుక్త విధాయక్ దళ్ ప్రభుత్వాలు అనేవారు. కానీ ఆ ప్రయోగం రెండు, రెండున్నరేళ్ల కన్నా కొనసాగలేదు. ఆ రాష్ట్రాలలో మళ్లీ ఎన్నికలు నిర్వహించవలసి వచ్చింది. అలాగే దాదాపు అదే సమయంలో తమిళనాడులో డి.ఎం.కె. అధికారంలోకి వచ్చింది. ఈ విషయాలన్నీ మోదీకి తెలియక పోయినా ఆయనకు ఉపన్యాసాలు రాసిచ్చే వారికి, సలహాలుఇచ్చే రవి శంకర్ ప్రసాద్ లాంటి వారికి ఈ చరిత్ర కచ్చితంగా తెలుసు. ఆ తరవాత వివిధ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలూ ఏర్పడడమే కాక ప్రభుత్వాలు కూడా ఏర్పాటు చేశాయి. వీటిని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సందర్భాలున్నట్టే అవి పడిపోయిన ఉదంతాలూ ఉన్నాయి. ఉమ్మడి ఎన్నికలు అసాధ్యం కావడానికి ఇంత చరిత్ర ఉండగా మోదీ మొండిగా ఉమ్మడి ఎన్నికల అంశాన్ని మళ్లీ ఎజెండాలో చేర్చడానికి కుటిల యత్నం చేస్తున్నారు. కేంద్రంలో ఒక ప్రభుత్వం అయిదేళ్లు పూర్తి అవకుండా పడిపోయినప్పుడు, రాష్ట్రాలలో ప్రభుత్వాలు పతనమైనప్పుడు మళ్లీ దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తారా అన్న సమస్యకు సమాధానం చెప్పకుండా ఉమ్మడి ఎన్నికల రాగం ఎత్తుకోవడంలో దేశమంతా తమ ఏలుబడే ఉండాలన్న స్వార్థ పూరిత రాజకీయ దృక్కోణాన్ని గమనించకుండా ఉండడం అసాధ్యం.

పొరుగు దేశమైన బంగ్లాదేశ్ లో తలెత్తిన రాజకీయ సంక్షోభాన్ని కూడా సంకుచిత మతతత్వ దృష్టితోనే చూస్తున్నారు. అక్కడ హిందువుల మైనారిటీ పక్షానికి చెందినవారు కనక హిందువుల మీద దాడులు జరుగుతున్నాయని ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. బంగ్లాదేశ్ లో దాడులు జరుగుతున్న మాట వాస్తవమే. ఆ దాడులు మొన్నటి దాకా అధికారంలో ఉన్న షేక్‌హసీనా నాయకత్వంలోని అవామీలీగ్ కు చెందిన వారిమీదే జరుగుతున్నాయి. దాడులకు గురవుతున్న వారిలో కొంతమంది హిందువులూ ఉండొచ్చు. కానీ వారు హిందువులు అన్న కారణంగా దాడులు జరగడం లేదు. అవి రాజకీయ కక్షల వల్ల జరుగుతున్నవి మాత్రమే. 140 కోట్ల మంది భారతీయులు బంగ్లాదేశ్‌లోని మైనారిటీల సంక్షేమం కోసం ఆందోళన చెందుతున్నారట. ఆ సంక్షోభానికి రాజకీయ కారణాలే ఉన్నాయి కానీ మతతత్వ కోణం లేనేలేదు. మన దేశంలో ముస్లింల మీద జరుగుతున్న దాడులను మోదీ ఒక్కసారి కూడా ప్రస్తావించలేదు. మణిపూర్‌లో పదిహేను నెలల నుంచి కొనసాగుతున్న అంతర్యుద్ధంలాంటి పరిస్థితి మోదీకి కలత కలిగించకపోవడం, ఆ విషయం ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం దుర్మార్గం. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో తన వీపు తాను చరుచుకోవడానికి మోదీ నానా పాట్లూపడ్డారు. తాను అవినీతిమీద యుద్ధం ప్రకటించానని గొప్పలు చెప్పుకున్నారు. బంధుప్రీతికి తాను వ్యతిరేకమట. మరి కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడు జే షా భారత క్రికెట్ సంఘం కార్యదర్శి ఎలా అయ్యారో! మోదీ డా.అంబేద్కర్ ను మాత్రమే అవమానించలేదు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని స్వాతంత్ర్య దినోత్సవ నిండు సభలో ఎర్రకోట సాక్షిగా అవమానించారు. ఎర్రకోటలో జరిగిన ఉత్సవానికి హాజరైన రాహుల్ గాంధీ అయిదవ వరసలో కూర్చోవలసి వచ్చింది. మోదీ ప్రసంగంలో స్వోత్కర్షలు తప్ప స్ఫూర్తి కలిగించే అంశం ఒక్కటి కూడా లేదు.

ప్రజలను మరుస్తున్న పార్టీలు

పార్టీలున్నయి మనిషి లేడు యింతేనయా ఈ పార్టీల తీరు యింతేనయా. నమ్మొద్దు నాయకులను నా మాట వినుడయ్యా బాబు వినండయ్యా- రావయ్యా బావ ఏంటి సుద్దులు చెబుతున్నావు. అవును నీకలానే ఉంటుంది. పార్టీకి ప్రజలు కావాలి. అయితే, ఎన్నికల్లో గెలిచాక ఆ పార్టీలు ప్రజలను పట్టించుకోవడంలేదు. నిజమే మనిషి సమాజపరంగా ఉన్న సమస్యల్ని వ్యక్తిగతంగా పరిష్కరించుకోలేక ఒక సంఘమో, ఒక సంస్థ లేక పార్టీనో ఏర్పాటు చేసుకుంటాడు. ఆ పార్టీల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడానికి ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని ఎన్నుకుంటాడు. ఆ ప్రభుత్వ యంత్రాంగం ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటాడు. అయితే ప్రస్తుతం రాజకీయాలు పరిశీలిస్తే ప్రజల కోసం పార్టీలా లేక పార్టీ కోసం ప్రజలా అనే ఆలోచన మొదలయింది. ఎందుకంటే పార్టీ నిర్మాణం అయ్యేవరకు మనిషికి ప్రాముఖ్యత ఉంటుంది. ఆ తర్వాత పార్టీ అధినాయకుడు, ఆయన అనుచరులు తప్ప మనిషి నిమిత్తమాత్రుడుగా మారాడు. ఒకప్పుడు బ్రిటీషు వారి చెరనుంచి విముక్తి పొందడానికి అన్ని పార్టీలు ఒకటయి పోరాటం చేశాయి. ఆ తర్వాత స్వతంత్ర ప్రతిపత్తితో రాజ్యాంగం ఏర్పాటు చేసుకుని తమను తాము పరిపాలించుకున్నట్లు భావించి సమస్యలు పరిష్కరించుకోవాలనుకున్నారు. అయితే నెహ్రూ, పటేల్

కాలం వరకు ప్రజలనుకున్నట్లుగానే పాలన జరిగింది. అధికారంలో ఉన్న నెహ్రూ, వివిధ పార్టీల నాయకులు సుందరయ్య, రాజేశ్వరరావు, మధులిమాయె, లోహియా, కృపలాని లాంటి వారి నుంచి ప్రతిపక్ష నాయకుల సలహాలు స్వీకరించేవారు. ప్రభుత్వం గాడి తప్పకుండా పాలన సాగేలా ప్రతిపక్ష నేతలు చూసేవారు. ప్రతిపక్ష సభ్యుల వాదనలోని నిజాయితీని గమనించి నెహ్రూ తగిన గౌరవం ఇచ్చేవాడు. అయితే ఇందిరాగాంధీ కాలం నుంచి ప్రజాస్వామ్యానికి తూట్లు పడటం మొదలయింది. ఈరోజు ప్రజలు పార్టీ కోసమే తప్ప మరెందుకు పనికిరాకుండా పోయారు. తాము ఎన్నుకున్న ప్రజాప్రతినిధి ముందు సమస్యలు విన్నవించుకోవడానికి చేతులు కట్టుకోవలసిన పరిస్థితి ఉంది. సమస్యలు పక్కన పెట్టి పార్టీని పటిష్టం చేసుకోవడంపై నాయకులు దృష్టి పెడుతున్నారు. 80 శాతం ప్రజలు తమ పార్టీలోకి రావాలని కోరుతున్నారు. పార్టీని పటిష్టపరుచుకొని తద్వారా అందలమెక్కడమే ప్రస్తుతం పార్టీ నాయకుల ఆలోచన. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం బలంగా ఉండాలంటారు. కానీ ప్రతిపక్షాన్ని బతకనీయరు. చంద్రబాబు సంపద సృష్టించడం తనకే సాధ్యమని చెప్పి యిప్పుడు ప్రజలు అర్థం చేసుకోవాలని అంటున్నాడు. సంపద సృష్టికి సలహాదారులను నియమించుకుంటే బాగుంటుంది. టోల్‌గేట్‌లు పెరుగుతాయని ఒక వార్త వినబడుతోంది. ఇదంతా ఎందుకు బావ. గ్రామ వాసులు వారి గ్రామ పొలిమేర దాటితే టోల్‌గేట్ ఉంటే కావలసినంత సంపద వస్తుంది. అయినా కేంద్రం నిధులు ఇచ్చే విషయంలో తన మన అని ఆలోచించడం తప్ప ఇండియా కూటమిలో ఉన్న రాష్ట్రాలను శత్రువులుగా పరిగణించి నిధులు ఇవ్వకపోవడం చాలా దుర్మార్గం. రాష్ట్రపతిగా పదవీవిరమణ సమయంలో ప్రణబ్‌ముఖర్జీ చట్ట సభలలో చర్చలు చాలా అవసరం అన్నాడు. అలాగే నాటి ఉపరాష్ట్రపతి అన్సారీ చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కాని నేటి పాలకులు ప్రతిపక్షం అనవసరమని భావిస్తున్నారు. ప్రజలకు మంచి చేస్తుంటే ప్రతిపక్షం చెడగొడుతోందని భావిస్తున్నారు. ఇక కేంద్రంలో బీజేపీ పెద్దలు వారికి వ్యతిరేకంగా ఉన్న రాష్ట్రాలకు నిధులివ్వకుండా ఇబ్బంది పెట్టి తమ పార్టీలో విలీనం చేసుకునే పద్ధతిలో ప్రవర్తిస్తున్నారు. అదిసరే ప్రతిపక్షం అవసరం లేదనే భావన ఉన్నప్పుడు ఎన్నికల ద్వారా ప్రజల సొమ్ము దుబారా చేయడం దేనికి. రాజుల పాలన వలే నియంతగా పాలించవచ్చుగద. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం చాలా అవసరం. కాని ప్రశ్న వేయడమే తప్పుగా భావిస్తున్నారు. ఏదిఏమైనా జగన్, చంద్రబాబు ఇద్దరూ కామధేనువు లాంటి ప్రత్యేక హోదా సాధించలేకపోయారు. ప్రాజెక్టులు, రోడ్లు, గృహాలు అవసరమేగాని, కూలి పని చేసుకునేవారికి పని దినాలు పెంచడం అంతకంటే అవసరమని ప్రభుత్వాలు గుర్తించాలి. అభివృద్ధికి మించి అవినీతి పెరుగుతున్న సంగతి మేధావులు గుర్తించారు. ఈ దశలో పార్టీ పెంపు కోసం అరాచకాలకు పాల్పడే నాయకుల తీరుతెన్నులు ప్రజలు గుర్తిస్తున్నారు. ఈ దశలో పార్టీలు పదవుల కోసం కాదని, ప్రజల సమస్యల పరిష్కారం కోసమని నాయకులు గుర్తించాలి. పెరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట పడాలి. కాని పక్షంలో ప్రజలకు కావల్సిన పనులు అలాగే మిగిలి ఉంటాయి. అవినీతి లాంటి సమాజ రుగ్మతలను రూపుమాపేందుకు రచయితలు, మేధావులు ఉద్యమించవలసిన అవసరం ఉంది. రాజకీయ పార్టీలకు మనిషే కేంద్ర బిందువని నాయకులు గుర్తించాలి.

సెల్: 9885569394

దర్యాప్తుపై మమత నిర్లక్ష్యం?

సుశీల్ కుట్టి

కోల్‌కతా ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన దుర్మార్గంపై దేశవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించి పెద్దఎత్తున నిరసన తెలియజేస్తున్నారు. ఈ దుర్ఘటన జరిగి రెండురోజులు గడిచినప్పటికీ ఇంతవరకు దోషిని అరెస్టు చేయలేదని తక్షణం అరెస్టుచేసి తీవ్ర శిక్షను వేయాలని డాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రమంతటా డాక్టర్లు ఆందోళన చేస్తున్నారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బాధితురాలి ఇంటికివెళ్లి పరామర్శించారని వార్తలు వచ్చాయి. దోషులను అరెస్టు చేసే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దోషులను పట్టుకుని తక్షణ అరెస్టు చేయాలని ఇలాంటి ఘాతుకాలు మెడికల్ కాలేజీలలోనూ జరిగితే, తల్లి దండ్రులు తమ పిల్లలను మెడికల్ కాలేజీలకు పంపేందుకు ముందుకురారని లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. కేసును సీబీఐకి అప్పగించినట్లుగా వార్తలు వచ్చాయి. బహుశా ఇది గ్యాంగ్‌రేప్ అయిఉండవచ్చునని కూడా వైద్యపరీక్షల్లో తేలినట్లు వార్తలు వస్తున్నాయి. ఇంతటి ఘోర కృత్యానికి పాల్పడిన దుర్మార్గులను ఉరివేసినా అదిసబబే అవుతుందని అందుకుకూడా తాను వెనుకాడబోనని మమత అన్నారు. ఆ తర్వాత పెద్దగా పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. బెంగాల్ రాష్ట్రవ్యాప్తంగా పార్టీలతో నిమిత్తం లేకుండా నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు. అయితే బీజేపీ మాత్రం ఇదే సమయమనుకుని మమతాబెనర్జీని అల్లరి చేసే ధోరణి కలిగి ఉన్నది. అంతేకాదు ఆసుపత్రి నిర్వహణ యంత్రాంగం ఈ ఘోరకలిని తక్కువచేసి చూపించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితురాలి నగ్న శరీరం వద్ద రక్తం విస్తరించి ఉన్నట్టుగా వెల్లడయ్యింది. ట్రైనీ డాక్టర్ పైన అత్యాచారం చేసింది ఒకరి కంటే ఎక్కువమంది ఉన్నారన్న వార్తలు కూడా వెల్లడయ్యాయి. రాష్ట్ర పోలీసుల పరిధిలోనే కేసు ఉండాలని మమతాబెనర్జీ భావిస్తున్నట్టుగా చెప్తున్నారు. ఇదిలా ఉండగా కోల్‌కతా హైకోర్టు కేసును సీబీఐ దర్యాప్తునకు అప్పగించింది. ఇది మమతాబెనర్జీకి ఇబ్బందికరంగా

తయారయ్యింది. జూనియర్ డాక్టర్ రాత్రిపూట డ్యూటీలో ఉండగా ఆమెపై అత్యాచారం జరిగింది. మహిళ ముఖ్యమంత్రిగా ఉన్న రాష్ట్రంలో ఇలాంటి దుర్ఘటన జరగటం తీవ్రంగా పరిగణించాలని అనేకమంది వ్యాఖ్యానించారు.

ఇండియా ఐక్య సంఘటనలో భాగస్వామిగా ఉన్న మమతాబెనర్జీ నిర్లక్ష్యం వహించటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. శక్తిమంతమైన ముఖ్యమంత్రిగా ఉన్న మమత దర్యాప్తును పక్కదారి పట్టించే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు. పోలీసుల దర్యాప్తు ప్రారంభం కావటానికి ముందే కేసును సీబీఐకి అప్పగించాలని హైకోర్టు నిర్ణయించటం మమతకు ఇరకాటంగానే ఉంది. సందేశ్‌ఖలీలో జరిగిన దుర్మార్గాలు మమతాబెనర్జీ ప్రతిష్టను ఇప్పటికే దిగజార్చాయని వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్ర పోలీసుల పట్ల, ముఖ్యమంత్రి పట్ల బాధితురాలి తల్లిదండ్రులు విశ్వాసం వ్యక్తం చేయడంలేదు. ఆసుపత్రిలో బాధితురాలిని చూసేందుకు ఆమె తల్లిదండ్రులను మూడు గంటల తరువాతనే అనుమతించారు. ఆమె మమత అని పేరు ఎలా పెట్టుకున్నారని బాధితురాలి తల్లి ప్రశ్నించింది. తన ప్రతిష్ట, అలాగే ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినకుండా చూడాలని మమత ప్రయత్నిస్తున్నారు. 2012 లో ఢిల్లీలో నిర్భయ కేసులో అత్యంత ఘోరంగా అత్యాచారంచేసి హత్య చేసిన సంఘటనకు కోల్‌కతాలో జరిగిన దుర్ఘటన ఎంతమాత్రం తక్కువది కాదని భావించవచ్చు. రెసిడెంట్ డాక్టర్లకు హామీ ఇవ్వడానికి మమతకు మాటలు రావటంలేదని అంటున్నారు. ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌ను తొలగించారు. ఆ ప్రిన్సిపల్‌ను మాట్లాడకుండా చేసేందుకు ఆయనకు ప్రమోషన్ ఇచ్చారని కొత్త హాస్పటల్ ప్రిన్సిపల్‌గా నియమించారని, అది ఆయన సొంతమని చెప్తున్నారు. ప్రిన్సిపల్‌ను తొలగించిన నాలుగు గంటలలోపు మరో కాలేజీకి ప్రిన్సిపల్‌గా నియమించారు. ప్రభుత్వానికి, మమతాబెనర్జీకి ప్రతిష్ట దెబ్బతింటుందని ఏ రాజకీయ నాయకుడైనా వ్యాఖ్యానిస్తున్నారు. ఆమెకు చెడ్డపేరు రాకపోదని రాష్ట్రంలో అనేకమంది నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ గతంలో ఇలా వ్యాఖ్యానించారు. "టైమ్స్ స్క్వేర్‌లో నేను ఎవరో ఒకరిని కాల్చి చంపినప్పటికీ ఇబ్బందేమీలేదు. నాకు ఓట్లు వస్తాయి" అని అన్నారు. మమత ధోరణి కూడా అలాగే ఉందని అంటున్నారు. ఆసుపత్రి పేరు, తన పేరు అప్రతిష్ట పాలుకాకూడదని చూస్తున్నారేగాని ఈ అత్యాచారం కేసుపైన శ్రద్ధ వహించటంలేదని విమర్శిస్తున్నారు. ఇలాంటివి ప్రజలు ఎక్కువ కాలం గుర్తుపెట్టుకోబోరని మమత అనుకుంటున్నారని విమర్శిస్తున్నారు. అయోధ్య లోక్‌సభ నియోజక వర్గంలో పన్నెండేళ్ల బాలికపై అత్యాచారాన్ని చేసిన వ్యక్తి తాను తిరిగి పోటీచేస్తే గెలుపొందుతానని ధైర్యం వ్యక్తం చేయడమంటే దుర్మార్గానికి హద్దులేకుండా పోతోంది. కోల్‌కతా పోలీసుల నుంచి కేసు ఎలాంటిదైనా తమ చేతుల్లోకి తీసుకోవాలని కోల్‌కతా హైకోర్టు భావించింది. దర్యాప్తు చేయడానికి మమతాబెనర్జీ పోలీసులకు ఆరు రోజులు గడువు ప్రకటించింది. అయితే హైకోర్టు మొదటగా కేసును విచారించిన వెంటనే సీబీఐకి అప్పగించింది. సాక్ష్యాన్ని మాయం చేయటానికి ప్రయత్నించవచ్చునని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రిన్సిపాల్‌ను తిరిగి మరో కాలేజీ ప్రిన్సిపల్‌గా నియమించటంపై కోర్టు అభ్యంతరం చెప్పింది. బీజేపీ నాయకుడు సువేందుఅధికారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఈ డిమాండ్‌ను ప్రజలేమీ పట్టించుకోలేదు. కాంగ్రెసు, సీపీఎం పార్టీలు కూడా ఇదే డిమాండ్ చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా ట్రైనీ డాక్టర్లు విధులకు హాజరుకాకుండా వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అయితే వ్యాధిగ్రస్థులు చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చినప్పటికి వారికి మందులు ఇచ్చేవారు లేకపోయారు. మమతాబెనర్జీ వద్ద ఆరోగ్యశాఖ, హోంశాఖలు కూడా ఉన్నాయి. 31 ఏళ్ల జూనియర్ డాక్టర్ అత్యాచారానికి, హత్యకు గురికావటం మొత్తం వ్యవస్థ విఫలమైందని చెప్పడానికి వెనుకాడరాదు. డాక్టరు 36 గంటలు పనిచేసిన తర్వాత విశ్రాంతి కోసం సెమినార్ గదిలోకి వెళ్లారు. మరుసటిరోజు ఉదయం ఆ డాక్టరు నగ్నంగా పడి ఉండటాన్ని గుర్తించారు. అత్యాచారం జరిగినట్టు గుర్తులు స్పష్టంగా ఉన్నాయి. ఇది జరిగిన తరువాత ఆమె తల్లిదండ్రులకు ఫోన్‌చేసి మీ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని చెప్పడం ఆసుపత్రి యంత్రాంగ నిర్లక్ష్యానికి నిదర్శనం.

నవ కేరళకు దిక్సూచి అచ్యుత మీనన్

మోదుమూడి మురళీకృష్ణ

అర్ధ శతాబ్దపు రాజకీయ జీవితంలో వెనుక బడిన వర్గాల అభివృద్ధికి ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి చెలత్ అచ్యుత్ మీనన్ ఎనలేని సేవ చేశారు. గొప్ప పరిపాలనాదక్షుడు, సాంఘిక న్యాయం కోసం సాహసోపేతంగా పోరాడిన యోధుడు అచ్యుతమీనన్. గొప్ప వ్యక్తిత్వానికి, నాయకత్వ లక్షణాలకు ప్రసిద్ధులు. కేరళ రాజకీయ అస్థిరతలో వుండగా మీనన్ ముందుకు వచ్చి రాష్ట్రంలోని లౌకికవాద, సోషలిస్టు, ప్రజాస్వామ్య శక్తులకు విజయవంతంగా నాయకత్వం వహించడమేకాక కేరళలో సుస్థిరత ఏర్పరిచి, ఆర్థికాభివృద్ధిని సాధించారు. దేశానికి ముఖ్యంగా కేరళకు ఒక నూతన మార్గాన్ని చూపేందుకు కృషిచేశారు.

'కేరళ కమ్యూనిస్టు ఉద్యమ మూలస్థంభాలలో మీనన్ ఒకరు. సామాజిక-రాజకీయ పరిణామాలు, వాస్తవాలపై స్పష్టమైన అవగాహన కలిగిన నేత. సంస్కరణలు ఏ మేరకు చేపడితే విజయవంతమవుతాయో అంచనా వేయడంలో దిట్ట. ఇతర పార్టీలు, గ్రూపులు ప్రగతిశీల వైఖరిని తీసుకునేలా ఒప్పించగల సామర్థ్యం కలిగిన ధీశాలి.. బ్యూరోక్రసీని క్షుణ్ణంగా సరిదిద్దడం, సంస్కరించడంలో ఆయన దక్షత ఎనలేనిది. ఆయన నిజాయితీ, అవినీతిరహిత పాలన చరిత్రలో నిలిచిపోయింది.'

భూసంస్కరణల చట్టం, మౌలిక సదుపాయల కల్పనలో సంస్కరణలకు ఆద్యుడు అయిన మంచి విద్యావేత్త మాత్రమే కాక వివిధ అంశాలపై అనేక గ్రంథాలు కూడా రచించారు. మృదుభాషి, ప్రియభాషి సమర్థవంత మైన నాయకుడు అయిన శ్రీ మీనన్ కేరళ రాజకీయాలను తట్టుకుని రికార్డుస్థాయిలో 7 సంవత్సరాల 4 నెలలపాటు ముఖ్య మంత్రిగా పనిచేశారు. ఇంతకాలం పాటు పదవిలో కొనసాగిన ఘనత అప్పట్లో మీనన్‌కే దక్కింది. ముందుగా 1969 నవంబరు 1 నుంచి 1970 ఆగస్టు 1 వరకూ ముఖ్యమంత్రి పదవిలో వున్నారు. రెండవసారి 1970 అక్టోబరు 4న ముఖ్యమంత్రిగా ఎన్నికై 1977 మార్చి వరకూ కొనసాగారు. నంబూద్రిపాద్ (1957-59) ప్రభుత్వంలో తన మంత్రి జీవితాన్ని ప్రారంభించిన అచ్యుతమీనన్ ఒక దశాబ్దం అనంతరం ఆయన వారసుడిగా ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. ఏడేళ్లు పాటు కొనసాగిన ఆయన మంత్రిమండలి కేరళలో అనేక సంస్కరణలను

ప్రవేశపెట్టింది. భూసంస్కరణల చట్టం, పరిహారం చెల్లించకుండా ప్రైవేట్ అడవులను స్వాధీనం చేసుకోవడం, వ్యవసాయ కార్మికుల చట్టం, పారిశ్రామిక కార్మికులకు గ్రాట్యూటీ, లక్ష గృహ నిర్మాణ పథకం వంటి అనేక సంక్షేమ చర్యలకు ఈ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పారిశ్రామికంగా కేరళ అభివృద్ధి చెందేందుకు దోహదం చేసింది. పూర్వపు ట్రావెన్కూర్-కొచ్చిన్ సంస్థానంలో త్రిస్సూర్‌లో మధ్యతరగతి నాయర్ కుటుంబంలో 1913 జనవరి 13వ తేదీన అచ్యుతమీనన్ జన్మించారు. ఆయన అద్భుత ప్రతిభాశాలి. మెట్రిక్ పరీక్షలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించారు. పాత మద్రాసు ప్రెసిడెన్సిలో అత్యధిక మార్కులతో భాష్యం అయ్యంగార్ స్వర్ణ పతకాన్ని పొందారు. సెయింట్ థామస్ కాలేజీ నుంచి గణితంలో డిగ్రీ పూర్తిచేశారు. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉత్తీర్ణు లయ్యారు. తిరువనంతపురం లా కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు. 1936లో త్రిసూర్ తిరిగివచ్చి 10 సంవత్సరాల పాటు న్యాయవాది వృత్తి నిర్వ హించారు. అది తన స్వభావానికి సరిపోదని గుర్తించాడు. అప్పటికే ఉవ్వెత్తున సాగుతున్న స్వాతంత్ర్య ఉద్యమానికి ఆకర్షితులయ్యారు. 1935లో కాంగ్రెస్ సభ్యుడయ్యారు. కొచ్చిన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీఆర్ కృష్ణన్ ఎజుతాచన్తో కలిసి రాష్ట్ర రైతులను సంఘటితం చేశారు. రాష్ట్ర కర్షక్ సంఘం కార్యదర్శిగా రైతుల సమస్యలపై పనిచేశారు. కొచ్చిన్ రాష్ట్రంలో మొట్టమొదటి కిసాన్ మార్చ్‌కు నాయకత్వం వహించి రాష్ట్రంలోని ఉత్తరాన ఉన్న తిరువిల్వామల నుంచి దక్షిణాన రాష్ట్ర రాజధాని ఎర్నాకులం వరకు నిర్వహించారు. అంటరాని వారికి ఆలయ ప్రవేశం కల్పించాలనీ, అంటరానితనం అంతం చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన మరొక మార్చ్‌కు కూడా అచ్యుతమీనన్ నాయకత్వం వహించారు. త్రిసూర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగాను, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులుగాను ఆయన ఎన్ని కయ్యారు. 1938లో ఏర్పడిన కొచ్చిన్ కాంగ్రెస్‌కు వ్యవస్థాపక కార్యదర్శిగా పని చేశారు.

'యుద్ధ వ్యతిరేక' విధాన ప్రసంగం చేసినందుకు 1940లో మీనన్‌కు జైలుశిక్ష విధించారు. ఏడాది జైలు జీవితంలో హెచ్.జి. వెల్స్ రచించిన 'ఏ షార్ట్ హిస్టరీ ఆఫ్ ది వరల్డ్'' గ్రంథాన్ని 'లోక చరిత్ర సంగ్రహం' పేరుతో మళయాళంలోకి అనువదించారు. కాంగ్రెస్‌లో ఉండగానే వామపక్షంతో సంబంధాలు ఏర్పర్చుకున్న అచ్యుత మీనన్ 1941లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

అనారోగ్య కారణాలతో 1987లో క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకునే వరకు పార్టీ సభ్యునిగా ఉన్నారు. పార్టీలో వివిధ బాధ్యతలు చేపట్టారు. జాతీయ సమితి సభ్యునిగా, కేరళ రాష్ట్ర సమితి కార్యదర్శిగా 1964లో పార్టీ చీలిపోక ముందు, తరువాత కూడా బాధ్యతలు నిర్వహించారు. అచ్యుత మీనన్ 1940లో మొదటిసారి జైలు శిక్ష అనుభవించారు. యుద్ధ వ్యతిరేక ప్రసంగం చేసినందుకు ఒక సంవత్సరం పాటు, 1942 ఆగస్టు 9 నాటి క్విట్ ఇండియా ఉద్యమం నేపథ్యంలో ఒక సంవత్సరానికి పైగా నిర్బంధంలో ఉన్నారు. 1948 నుంచి 52 వరకు రహస్య జీవితం గడిపారు. కమ్యూనిస్టు పార్టీ కార్య కర్తగా అనేకసార్లు జైలుశిక్ష అనుభవించారు. మొట్టమొదటిసారిగా 1952లో ట్రావన్కోర్ -కొచ్చిన్ శాసనసభకు ఎన్నికయ్యారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అనంతరం 1957లో జరిగిన మొదటి సార్వత్రిక ఎన్నికల్లో కేరళ శాసనసభకు ఎన్నికై ఈఎంఎస్. నంబూద్రిపాద్ మంత్రివర్గంలో ఆర్థిక శాఖ నిర్వహించారు. కేరళ ప్రథమ ఆర్థిక మంత్రిగా మొదటి సంవత్సరంలోనే రాష్ట్రానికి మిగులు బడ్జెట్ సమర్పించి సంచలనం సృష్టించారు. ఈఎంఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే లేవనెత్తిన 'విముక్తి పోరాటం' తీవ్రస్థాయికి చేరడంతో హోంశాఖను ఆయనకు అప్పగించారు. ఆయన పరిపాలనా దక్షతకు ఇది ఒక ప్రమాణం. 1957, 1960, 1969, 1970 ఎన్నికలలో కూడా ఆయన విజయం సాధించారు. 1968లో ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు, అయితే 1969లో రాజకీయ పరిస్థితులు ఊహించని మలుపు తిరిగి, ఈఎంఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలోని మంత్రివర్గం అనూహ్యంగా రాజీనామా చేసింది. దానితో ఏర్పడిన రాజకీయ శూన్యత భర్తీ చేసి పరిపాలన సాగించాలన్న పార్టీ ఆదేశం మేరకు అచ్యుత మీనన్ ప్రభుత్వ బాధ్యతలను చేపట్టారు. 1970 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ కూడా మంత్రివర్గంలో చేరింది. ఈ ప్రభుత్వం ఏడు సంవత్సరాలు అధికారంలో కొనసాగి అనేక విప్లవాత్మక, ప్రజానుకూల నిర్ణయాలు తీసుకుంది. వివిధ రాజకీయ పార్టీల సంకీర్ణ ప్రభుత్వం విజయవంతంగా పని చేయగలదనీ, ప్రాథమిక సంస్కరణలను తీసుకురాగలదని అచ్యుత మీనన్ నిరూపించారు. అచ్యుత మీనన్ 1977లో ముఖ్య మంత్రి పదవి నుంచి తప్పుకున్నారు. పదవీ విరమణ తర్వాత ఆయన ఎప్పటిలాగే ప్రజల సేవలో చురుకుగా పాల్గొన్నారు. ప్రజాస్వామ్య వికేంద్రీకరణ, మహిళా సమస్యల పరిష్కారం, సంపూర్ణ అక్షరాస్యత కోసం ఆయన పరితపించారు. 1991 ఆగస్టు 16న అచ్యుతమీనన్ తుదిశ్వాస విడిచారు. ఆయన జీవితం నేటి తరానికి ఎంతో ఆదర్శనీయం.

(నేడు అచ్యుత మీనన్ 33వ వర్థంతి సందర్భంగా)

విభజించి పాలించడమే వారి ధ్యేయం

సంఘ్‌పరివార్, బీజేపీపై ఖడ్గే మండిపాటు

న్యూఢిల్లీ: సమాజంలో ద్వేషాన్ని వ్యాప్తి చేసేందుకే విభజన గాయాల స్మారక దినాన్ని నిర్వహిస్తున్నారని బీజేపీ, కేంద్రప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే మండిపడ్డారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మాట్లాడిన ఆయన..... బ్రిటీష్ వారి విభజించి పాలించు విధానాన్ని సంఘ్ పరివార్ ప్రోత్సహిస్తోందని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం భారత బలమని, బలహీనతకాదని ఖడ్గే స్పష్టంచేశారు. మనకు స్వాతంత్ర్యం చాలా సులభంగా వచ్చిందని..... కొందరు ప్రచారం చేస్తున్నారన్న ఆయన నిజానికి లక్షలాది త్యాగాలతోనే సిద్ధించిందని చెప్పారు. వారు చూపిన బాటలో కాకుండా విభజన వాదాన్ని నేటి పాలకులు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొననివారు కాంగ్రెస్‌కు సలహాలు ఇస్తున్నారని ఖడ్గే ధ్వజమెత్తారు. 1947లో దేశ విభజన సమయంలో మరణించిన వారి సంస్మరణార్థం 2021 నుంచి విభజన గాయాల స్మారక దినాన్ని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పాటిస్తోందన్నారు. వారి విద్వేషపూరిత రాజకీయాలు దేశ విభజనకు దారితీశాయన్నది చారిత్రక సత్యమని ఖడ్గే విమర్శించారు. వారి కారణంగానే విభజన జరిగింది. తమ స్వలాభం కోసం సంఘ్ పరివార్ బ్రిటీష్ వారి విభజించి పాలించు విధానాన్ని ప్రచారం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న 'హర్ ఘర్ తిరంగా' ప్రచారంపై మాట్లాడుతూ... 'వారు 60 ఏళ్లుగా చేసిన తప్పుకు పశ్చాత్తాపపడుతున్నందుకు మేము సంతోషిస్తున్నామని ఖడ్గే బీజేపీని ఎద్దేవా చేశారు. తమ కార్యాలయాలపై జెండా ఎగురవేయకుండా తప్పించుకునే వారు ఇప్పుడు 'హర్ ఘర్ తిరంగా' అని మాట్లాడుతున్నారని ఖడ్గే అన్నారు. కుల, మతాలతో నిమిత్తం లేకుండా అన్ని వర్గాల ప్రజలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని త్యాగాలు చేశారని ఖడ్గే కొనియాడారు. 'దశాబ్దాల పోరాటం, త్యాగాల తర్వాత దాస్య శృంఖలాలు తెగిపోయి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.... స్వాతంత్ర్య సమరయోధులందరికీ నమస్కరిద్దాం. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, రాజేంద్రప్రసాద్ , సరోజినీ నాయుడు లాంటి అసంఖ్యాక త్యాగధనులు దేశ నిర్మాణంలో చారిత్రాత్మక పాత్ర పోషించారు' అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ప్రజల స్ఫూర్తి, త్రివర్ణ పతాక వైభవాన్ని దేశం చూసిందని ఖడ్గే అన్నారు. "దేశ ప్రజలు 'హర్ ఘర్ నౌక్రీ', 'హర్ ఘర్ న్యాయ్' కోరుకుంటున్నారు. మాకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కావాలి. ఈ దేశం ఆర్థిక అసమానత, నిరుద్యోగం నుండి విముక్తిని కోరుకుంటోంది" అని ఖడ్గే అన్నారు. ఈ సమస్యలను పరిష్కరించడంలో ఎంత ఆలస్యం చేస్తే సమస్యలు అంతగా పెరుగుతాయని హెచ్చరించారు. మోదీ ప్రభుత్వం

పదేళ్లకు పైగా అధికారంలో ఉన్నప్పటికీ ప్రజలు ఇంకా నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతితో సతమతమవుతున్నారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. దళితులు, ఆదివాసీలు, మహిళలు, రైతులే కాంగ్రెస్ ప్రాధాన్యత అని ఖడ్గే స్పష్టం చేశారు. "దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగేలా మేము నిర్ధారిస్తాము." అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పాల్గొన్నారు. అంతకుముందు 'ఎక్స్' లో పోస్ట్ చేసిన వీడియో సందేశంలో ఖడ్గే... రాజ్యాంగ, స్వయంప్రతిపత్త సంస్థలను ప్రభుత్వం తోలుబొమ్మలుగా మార్చడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. 140 కోట్ల మంది భారతీయులకు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అతిపెద్ద కవచాలని... "మా చివరి శ్వాస వరకు వాటిని కాపాడుకుంటాము" అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ, "దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, న్యాయం, సమానత్వం, ఐక్యత మన జాతీయ సంకల్పం, ఈ విలువలే మన రాజ్యాంగానికి పునాది. వాటిని రక్షించడం మన అంతిమ కర్తవ్యం" అని అన్నారు. 'మన స్వేచ్ఛ, రాజ్యాంగం మరియు దాని సూత్రాలను పరిరక్షించాలనే మా సంకల్పం దృఢమైనది' అని చెప్పారు.

'అగ్ని' అగర్వాల్ కన్నుమూత

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన ప్రముఖ ఏరోస్పేస్ ఇంజనీర్ రామ్ నారాయణ్ అగర్వాల్ (84) హైదరాబాద్‌లోని స్వగృహంలో గురువారం తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. భూతల క్షిపణి... భారత క్షిపణుల్లో మణిహారంగా పేర్కొనే 'అగ్ని'ని రూపొందించడంలో ఆయనదే ప్రముఖ పాత్ర. అందుకే అగర్వాల్‌ను ఫాదర్ ఆఫ్ ది అగ్ని సిరీస్ ఆఫ్ మిస్సైల్స్‌గా పిలుస్తుంటారు. రామ్ నారాయణ్ అగర్వాల్ రాజస్థాన్‌లోని జైపూర్‌లో వ్యాపారుల కుటుంబంలో జన్మించారు. బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ప్రోగ్రాం డైరెక్టర్‌గా, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లాబొరేటరీ డైరెక్టర్‌గా పనిచేశారు. అగర్వాల్ 1983 నుంచి అగ్ని ప్రయోగానికి నాయకత్వం వహించారు. 33 ఏళ్ల క్రితం... మే 22, 1989న ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా ఉన్న అగర్వాల్... తన బృందంతో కలిసి 1000 కిలోల పేలోడ్‌తో 800 కి.మీపైగా అగ్ని క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు. ఈ మీడియం రేంజ్ బాలిస్టిక్ క్షిపణిని ఒడిశా తీరంలోని బాలాసోర్‌లోని చండీపూర్‌లో ప్రయోగించారు. రక్షణ రంగంలో ఆయన చేసిన కృషికి భారత ప్రభుత్వం 1990లో పద్మశ్రీ, 2000లో పద్మభూషణ్ అవార్డులతో సత్కరించింది. దేశ రక్షణ కోసం అవిరామంగా కృషి చేసిన అగర్వాల్... స్వాతంత్ర్య దినోత్సవం రోజే కన్నుమూయడం గమనార్హం.

అసోంలో 19 చోట్ల బాంబులు అమర్చిన ఉల్ఫా

గువహటి: అసోంలో రాష్ట్ర సాయుధ వేర్పాటువాద సంస్థ 'యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అసోం (ఉల్ఫా) కలకలం రేపింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను భగ్నం చేసేందుకు 19 బాంబులు అమర్చినట్లు గురువారం ప్రకటించింది. ఎగువ అస్సాంలోని శివసాగర్, దిబ్రూగఢ్, గువహటి, దిగువ అస్సాం వంటి అనేక ప్రాంతాల్లో బాంబులు అమర్చినట్లు తెలిపింది. ఆ ప్రకటన చేసిన కొద్ది సేపటికే శివసాగర్, నాగోన్‌తో సహా పలు ప్రాంతాల్లో పోలీసులు అనుమానాస్పద వస్తువులను గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో బాంబు పేలుళ్లతో తమ ఉనికిని చాటుకుంటామని తెలిపింది. అయితే సాంకేతిక కారణాల వల్ల ఆపరేషన్‌ను విరమించుకుంది. పేలుడు పదార్థాలు సాధారణ ప్రజలకు ముప్పు వాటిల్లకుండా వాటిని వెలికితీసి నిర్వీర్యం చేయాలని అభ్యర్థించింది. బాంబులు ఎక్కడెక్కడ అమర్చిందో వాటి ప్రాంతాల్ని సైతం వెల్లడించింది. కానీ టిన్సుకియా జిల్లాలోని మూడు చోట్ల, దిబ్రూగఢ్ జిల్లాలో ఒక చోట, గోలాఘాట్, సోరుపత్తర్‌లో ఒక్కో ప్రదేశంతో సహా మూడు చోట్ల బాంబులు అమర్చినట్లు చెప్పింది. కానీ కచ్చితమైన ప్రదేశాన్ని నిర్ధారించలేకపోయింది.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు... నిలిచిన రాకపోకలు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని దామోహ్ జిల్లాలో రైలు ప్రమాదం జరిగింది. కట్నీ నుంచి సాగర్‌కు బొగ్గుతో వెళుతున్న గూడ్సు రైలు పథారియా సమీపంలో పట్టాలు తప్పింది. ఏడు వ్యాగన్లు ట్రాక్‌పై బోల్తా పడ్డాయి. ఈ ప్రమాద ఘటనలో ట్రాక్‌లు, స్లీపర్‌లు, ఓహెచ్‌ఈ కేబుల్స్ దెబ్బతినడంతోపాటు సాగర్, దామోహ్, కట్నీ మార్గాల్లో రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రైలు కోచ్‌ల చక్రాలు విడిపోయి, ట్రాక్‌పై చెల్లాచెదురుగా పడిపోవడంతో వ్యాగన్లలోని బొగ్గంతా నేలపాలైంది. అర కిలోమీటరు మేర రైలు స్తంభాలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు.

మమత రాజీనామా చేయాలి: బీజేపీ

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో ఓ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై నిరసనలు ఉధృతంగా కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో గురువారం ఉదయం ఆర్జీ కార్ వైద్య కళాశాల వద్ద చోటుచేసుకున్న విధ్వంసకర ఘటనలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం మమతా బెనర్జీ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. దీనికి నిరసిస్తూ బీజేపీ మహిళా విభాగం అధ్వర్యంలో మమతా బెనర్జీ నివాసం వరకు శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ మాట్లాడుతూ... బెంగాల్‌లో శాంతిభద్రతలు విఫలమయ్యాయని ఆరోపించారు. గత వారంలో వైద్యురాలిపై హత్యాచారం జరిగిన ఆర్జీకార్ వైద్య కళాశాల వద్ద తమ పార్టీ తరఫున నిరసన దీక్షకు దిగుతామన్నారు. మహిళా మోర్చా అధ్వర్యంలో హజ్రా క్రాసింగ్ నుంచి కాళీఘాట్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లను దిగ్బంధించనున్నట్లు వివరించారు.

అధినేత విడుదలయ్యాక సునీత కేజ్రీవాల్

రాజకీయపాత్ర ముగిసిపోవచ్చు

సిసోడియా



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జైలు నుంచి విడుదలైన తర్వాత ఆయన భార్య సునీత రాజకీయ పాత్ర ముగిసిపోవచ్చని ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా అన్నారు. తన భర్త పోరాట పటిమను ప్రజలకు తెలియజేయడంలో ఆమె అద్భుత పాత్ర పోషించారని ప్రశంసించారు. ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించి మార్చి 21న కేజ్రీవాల్ అరెస్ట్ అయిన తర్వాత సునీత ఆయనకు, పార్టీకి మధ్య వారధిగా పనిచేశారని... ఢిల్లీ, గుజరాత్, హర్యానాలో లోక్‌సభ ఎన్నికల కోసం ఆప్ ప్రచారంలో కూడా కీలక పాత్ర పోషించారన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సిసోడియా మాట్లాడుతూ... సునీతా కేజ్రీవాల్ ముఖ్యమంత్రి పాత్రను స్వీకరిస్తారనే మీడియా ఊహాగానాలను కొట్టిపారేశారు. గత ఏడాది ఫిబ్రవరి 26 న ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించి అరెస్టయిన సిసోడియా... గత వారం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడిగా, పార్టీ ఎలా పనిచేస్తుందో... కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో అసలు ఏం జరుగుతోందో జైలులో ఉన్నప్పుడు కూడా తనకు తెలుసని మాజీ ఉప ముఖ్యమంత్రి అన్నారు. సంక్షోభ సమయంలో పార్టీకి సునీత సేవలు అవసరమని సిసోడియా అన్నారు. 'ఆమె పోరాట యోధుడైన భర్త జైలుకెళ్లిన సమయంలో పార్టీ (ఆప్)ని ప్రజలకు చేరువచేసే వ్యక్తి అవసరం ఉంది . ఆమె అరవింద్ కేజ్రీవాల్ యొక్క విశ్వసనీయ, భావోద్వేగ గళంగా మారారు' అని ఆయన అన్నారు. సునీతా కేజ్రీవాల్ మార్చిలో రాంలీలా మైదాన్‌లో విపక్ష ఇండియా ఐక్యసంఘటన నిర్వహించిన ర్యాలీలో ప్రసంగించారు. ఏప్రిల్‌లో జరిగిన "న్యాయ్ ఉల్లంఘన్ ర్యాలీ"లో పాల్గొనేందుకు ఆమె రాంచీకి కూడా వెళ్లారు. ఆ సమయంలో తీహార్ జైలులో ఉన్న సిసోడియా మాట్లాడుతూ... 'సునీతా కేజ్రీవాల్ పోషించిన ఈ పాత్ర చాలా అద్భుతంగా ఉంది. టీవీలో ఆమె ప్రసంగాలు చూస్తుంటే నాకు చాలా బాగా అనిపించింది. ఆమె పోరాట స్ఫూర్తిని తెలియజేసే పాత్రను పోషించినందుకు నేను చాలా గర్వపడుతున్నాను. భర్తను ప్రజల హృదయాల్లో చాలా చక్కగా బంధించారు." అన్నారు. సునీతా కేజ్రీవాల్ భవిష్యత్తు రాజకీయ పాత్ర గురించి అడిగినప్పుడు "అరవింద్ జీ బయటకు వచ్చిన తర్వాత, ఈ పాత్ర ముగిసిపోతుందని నేను అనుకుంటున్నాను. ఇంతకు మించి ఏమీ లేదని నేను అనుకుంటున్నాను' అని చెప్పారు.

సుప్రీం తీర్పుతో మైనింగ్ కంపెనీలపై

రూ.2 లక్షల కోట్ల భారం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఇటీవల మైనింగ్ రాయల్టీ కేసును విచారించి తీర్పును వెలువరించింది. ఖనిజాలు, గనులు కలిగి ఉన్న భూమిపై పన్నులు విధించే అధికారం రాష్ట్రాలకు ఉందని తీర్పులో స్పష్టం చేసింది. ఖనిజాలు, గనులు కలిగిన భూమిపై పన్నులు విధించే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీం స్పష్టం చేయడంతో మైనింగ్ కంపెనీలపై రూ. 1.8 లక్షల కోట్ల నుంచి రూ. 2 లక్షల కోట్ల వరకు భారం పడవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. భారతీయ ఖనిజ పరిశ్రమల సమాఖ్య (ఫిమి) సుప్రీం తీర్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. భారతీయ మైనింగ్ రంగం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా అత్యధిక పన్ను రేట్లను ఎదుర్కొంటుందని ఫిమి పేర్కొంది. ఫిమి అడిషనల్ సెక్రటరీ జనరల్ బీకే భాటియా మాట్లాడుతూ...'మైనింగ్ కంపెనీలు ఏప్రిల్ 1, 2005 నుంచి పొందిన రాయల్టీలను తిరిగి చెల్లించాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. దాంతోపాటు మైనింగ్ భూమిపై పన్ను విధించే హక్కు రాష్ట్రాలకు ఉందని చెప్పింది. ఈ నేపథ్యంలో కంపెనీలకు నష్టం వాటిల్లుతుంది. ఒడిశా, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో గనులు తీవ్రంగా దెబ్బతింటాయి. ఇప్పటికే అంతర్జాతీయంగా మైనింగ్ కంపెనీలు భారీగా పన్నులు చెల్లిస్తున్నాయి. సుప్రీం తీర్పు వల్ల అంతిమ ఉత్పత్తులపై ప్రభావం పడుతుంది. దాంతో ద్రవ్యోల్బణం పెరుగుతుంది. పన్నుల విధానాన్ని స్థిరీకరించేందుకు, మైనింగ్ రంగం వృద్ధికి కేంద్ర ప్రభుత్వం శాసనపరమైన చర్యలు తీసుకోవాలి' అని అన్నారు. ఇదిలాఉండగా, ఖనిజాలు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో కంపెనీలు గత 12 ఏళ్ల నుంచి రాయల్టీ బకాయిలు చెల్లించడం భారం అవుతుంది. ఇప్పటికే చాలా ఉత్పత్తుల ధరలు పెరిగాయి. సుప్రీంకోర్టు తీర్పుతో ఖనిజాలను ముడిసరుకుగా ఉపయోగించుకుని తయారయ్యే ప్రతి వస్తువుపై ధరల ప్రభావం ఉంటుంది. కోర్టు తీర్పు పాటించాలంటే కంపెనీలు తన జేబులో డబ్బులు వెచ్చించవు. తిరిగి వినియోగదారులపైనే ఆ భారాన్ని మోపుతాయి. దానివల్ల సామాన్యుడికే నష్టమని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు.

రైలు నుంచి విడిపోయిన బోగీలు... తప్పిన ప్రమాదం

అహ్మదాబాద్: గుజరాత్‌లో ఓ రైలుకు పెను ప్రమాదం తప్పింది. కదులుతున్న రైలు నుంచి రెండు బోగీలు విడిపోయాయి. అదృష్టవశాత్తూ ఎవరికీ ప్రమాదం జరగలేదు. ఈ ఘటన వడోదర సమీపంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. రైల్వే అధికారుల వివరాల ప్రకారం... అహ్మదాబాద్-ముంబై మధ్య నడుస్తున్న (12932) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన రెండు కోచ్‌లు రైలు నుంచి విడిపోయాయి. ఉదయం 8.50 గంటలకు వడోదర డివిజన్‌లోని గోతంగం యార్డ్ సమీపంలో ఈ ఘటన జరిగింది. కప్లర్ విరిగిన కారణంగా ఏడు, ఎనిమిది కోచ్‌లు విడిపోయాయి. ఆ సమయంలో రైలు నెమ్మదిగా వెళ్తుండటంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఉదయం 11.37 గంటలకు మెయిన్‌లైన్‌లో ట్రాఫిక్‌ను క్లియర్ చేసినట్లు వెల్లడించింది. అహ్మదాబాద్ నుంచి ముంబై వెళ్లే రైళ్ల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

బ్రిటిష్ ఆర్కెస్ట్రా... 14 వేల మంది చిన్నారులతో

గిన్నిస్‌కెక్కిన గ్రామీ విజేత జాతీయ గీతాలాపన

న్యూఢిల్లీ: తన గానంతో ప్రపంచవ్యాప్తంగా పేరు పొందిన భారతీయ సంగీత దర్శకుడు, గ్రామీ విజేత రిక్కీ కేజ్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అద్భుతమైన వీడియో రూపొందించారు. ప్రముఖ సంగీతకారుల సహకారంతో మన జాతీయ గీతాన్ని వైవిధ్యభరితంగా ఆలపించారు. బ్రిటిష్ ఆర్కెస్ట్రా, 14వేల మంది ఆదివాసీ చిన్నారులతో రూపొందించిన ఈ గీతాలాపన.. గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో చోటు దక్కించుకోవడం విశేషం. ఈ వీడియోను రిక్కీ కేజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. పండిట్ హరిప్రసాద్ చౌరాసియా, రాకేశ్ చౌరాసియా, రాహుల్ శర్మ, అమన్, అయాన్ అలి బంగాశ్, జయంతి కుమరేశ్, షేక్ మహబూమ్, కలీషాబీ మహబూబ్ వంటి ప్రముఖ క్లాసికల్ మ్యుజీషియన్లు తమ వాయిద్యాలతో జాతీయ గీతాన్ని ప్రత్యేకంగా పలికించారు. వీరితో పాటు యూకేలోని రాయల్ ఫిల్‌హార్మోనిక్ ఆర్కెస్ట్రాకు చెందిన 100 మంది సభ్యుల బృందం కూడా గీతాలాపనలో పాల్గొంది. కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన 14వేల మంది ఆదివాసీ చిన్నారులు భారతదేశ చిత్రపటం ఆకృతిలో 'భారత్' ఆంగ్ల, హిందీ అక్షరక్రమంలో నిల్చొని జాతీయగీతాన్ని ఆలపించారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా రిక్కీ కేజ్ మాట్లాడుతూ.. 'చిన్న వయసులో నేను విన్న తొలి మ్యూజిక్ మన జాతీయగీతమే. అత్యుత్తమ శాస్త్రీయ సంగీతకారులను ఒక వేదికపైకి తీసుకొచ్చి ఇలా జాతీయగీతాన్ని ఆలపించడం చాలా అద్భుతంగా ఉంది' అని ఆనందం వ్యక్తంచేశారు. వీఆర్ ఫిల్మ్‌మేకర్ సాయిరామ్ సాగిరాజు, కొంతమంది డెవలపర్లతో కలిసి రిక్కీ ఇలా వర్చువల్ రియాల్టీ వెర్షన్ ప్రాజెక్ట్‌ను రూపొందించారు. ఆయన గతంలోనూ ఇలాంటి వైవిధ్యభరిత ప్రదర్శనలు ఇచ్చారు. 2023లో లండన్‌లోని అబే రోడ్ స్టూడియోస్ వద్ద అతిపెద్ద సింఫనీ ఆర్కెస్ట్రాతో జాతీయ గీతాన్ని ఆలపించారు.

మహిళలందరికీ ఏటా రూ.50 వేలు



భువనేశ్వర్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ మహిళలు, రైతులకు తీపికబురు చెప్పారు. భువనేశ్వర్‌లో గురువారం జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధుల నిస్వార్థ పోరాటం, సేవల ఫలితంగానే మనకు 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభించిందని చెప్పారు. ఆపై స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామని అన్నారు. స్వతంత్రం కోసం ఎంతోమంది తమ ప్రాణాలను అర్పించడంతో పాటు సమున్నత త్యాగ ఫలితమే ఇవాళ మనం వాటి ఫలాలను అనుభవిస్తున్నామని చెప్పారు. స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని సుభద్ర యోజన పథకం ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. దీనిద్వారా మహిళలందరికీ ఏటా రూ. 50 వేలు అందచేస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబరు 17న ఈ పథకాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

ఇక ఒడిశా రైతులకు వరి పంటకు దేశంలోనే అత్యధికంగా క్వింటాల్‌కు రూ. 3,100 చెల్లిస్తామని ఆయన చెప్పారు. రైతులు, మహిళల మేలు కోసం ఇదంతా చేస్తున్నట్టు సీఎం పేర్కొన్నారు.

యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆనంద్ మహీంద్రా ఏడాదిపాటు ఈ పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలోని బేగరికంచెలో స్కిల్ వర్సిటీ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేశారు. 17 రకాల కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

విద్యార్థిని కొట్టి చంపిన మావోయిస్టులు

రాయపూర్ (ఛత్తీస్‌గఢ్): పాఠశాల విద్యార్థిని పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా అనుమానించి మావోయిస్టులు అతడిని కొట్టి చంపారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పువర్తి గ్రామానికి చెందిన శంకర్ (16) దంతెవాడ జిల్లా పల్నార్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. వారం రోజుల క్రితం కుటుంబానికి చెందిన ఒక మహిళ మరణించడంతో పువర్తికి వచ్చాడు. అయితే పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా అనుమానించిన మావోయిస్టులు ఆ యువకుడిని కొట్టి చంపారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్ట్‌మార్టం కోసం శంకర్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు శంకర్ అన్నయ్య సోయం సీతారామ్ (19)ను కూడా వారం క్రితం మావోయిస్టులు దారుణంగా హత్య చేశారు. అయితే పోలీసులకు సమాచారం ఇవ్వని కుటుంబ సభ్యులు గుట్టుగా అంత్యక్రియలు నిర్వహించారు. ఆ తర్వాత మావోయిస్టుల భయంతో శంకర్ కుటుంబం గ్రామం విడిచి వేరే ప్రాంతానికి వెళ్లిందని పోలీసులు తెలుసుకున్నారు.

తాత్కాలిక గేటు ఏర్పాటులో మరోరోజు ఆలస్యం



హోస్‌పేట్ (కర్నాటక): తుంగభద్ర ప్రాజెక్టులో కొట్టుకుపోయిన 19వ గేటు స్థానంలో తాత్కాలిక తలుపుల ఏర్పాటుకు మరో రోజు ఆలస్యం కానుంది. యంత్రాలు, నిపుణ కార్మికులు డ్యామ్ వద్దకు చేరుకున్నా... సిద్ధం చేసిన గేటును (ఎలిమెంటు) తరలించడంలో జాప్యం చోటుచేసుకుంది. మూడు రోజులుగా రాత్రివేళ వర్షాలు పడటం, పగటిపూట ఎండలు కాస్తుండటంతో పనులు చేపట్టడానికి వాతావరణం అనుకూలించ లేదు. ఏపీకి చెందిన నిపుణుడు కన్నయ్యనాయుడి సమక్షంలోనే ఎలిమెంటును అమర్చాల్సి ఉంది. సుమారు 85 ఏళ్ల వయసున్న ఆయన ఆరోగ్యం ఎండావానలకు దెబ్బతినకూడదని డ్యామ్ ఇంజినీర్లు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో పని పూర్తిచేయాలని కన్నయ్యనాయుడు ఇంజినీర్లతో కలిసి కృషి చేస్తున్నారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు పనులకు కొంత అడ్డంకిగా మారాయి. మరోవైపు జలాశయానికి వస్తున్న వరద పరిమాణంలో మళ్లీ పెరుగుదల కనిపిస్తోంది. మూడు రోజుల క్రితం 20 వేల క్యూసెక్కులున్న వరద 32 వేల క్యూసెక్కులకు చేరుకుంది. ఈ నెల 18 తరువాత నుంచి రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అప్పుడు గేటును అమర్చడం కష్టసాధ్యం అవుతుంది. జలాశయంలో ప్రస్తుతం 83 టీఎంసీల జలాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పనులు నిర్విఘ్నంగా జరగాలని కర్నాటక మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్, తుంగభద్ర మండలి కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నిపుణుడు కన్నయ్యనాయుడు, పర్యవేక్షక ఇంజినీరు శ్రీకాంత్‌రెడ్డి గేటుకు శాంతి పూజలు చేయించారు.

రైలు ప్రయాణికులకు కొత్తరకం దుప్పట్లు

న్యూఢిల్లీ: మరింత సౌకర్యవంతంగా ఉండేలా అత్యంత మృదువైన దుప్పట్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ఎక్కువకాలం మన్నడంతోపాటు ప్రయాణికులు వీటిని కప్పుకుంటే ఇబ్బంది లేకుండా శ్వాస తీసుకునే వీలుంటుంది.

భారత ప్రమాణాల సంస్థ (బీఐఎస్)తో కలిసి విస్తృత పరిశోధన చేసి, ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్లతో సంప్రదించి వీటిని రూపొందించారు. ఆతిథ్య పరిశ్రమతో సమానంగా తాజా అనుభూతి కలిగేలా చూడడం ఈ ప్రయత్నం ఉద్దేశమని ఉత్తర రైల్వే తెలిపింది. రాంచీ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో వీటిని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ప్రయాణికుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత మిగిలిన రైళ్లకు అందుబాటులోకి తెస్తారు.

తిరంగా యాత్రలో సావర్కర్ టీషర్టుల వివాదం

సురేంద్రనగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గుజరాత్‌లోని ఓ పాఠశాల విద్యార్థులు, సిబ్బంది నిర్వహించిన తిరంగా యాత్ర వివాదానికి తెరతీసింది. హిందూత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్ టీషర్టులు ధరించి యాత్రలో పాల్గొనడం స్థానికంగా దుమారం రేపింది. గుజరాత్‌లోని కాంగ్రెస్ నేతలు న్యాయ యాత్ర సాగే మార్గంలో తిరంగా యాత్ర ఎదురు రావడం, సావర్కర్ టీషర్టులపై నాయకుల అభ్యంతరం చెప్పడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. గాంధీ హత్యకు కుట్ర చేసిన సావర్కర్ చిత్రంతో కూడిన టీషర్టులు ధరించి తిరంగా యాత్రలో పాల్గొనడానికి సిగ్గుచేటని కాంగ్రెస్ గుజరాత్ అధ్యక్షుడు రిత్విక్ మక్వానతో పాటు నలుగురు నేతలు ఆ స్కూలు సిబ్బందిని నిలదీశారు. ప్రిన్సిపల్ కల్పేశ్ చౌహాన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఐదుగురు నేతలపై కేసు పెట్టినట్లు పోలీసు అధికారి గురువారం వెల్లడించారు. భారతీయ న్యాయ సంహితలోని 126 (2), 197 (1)(సి), 197(1)(డి), 221, 352 కింద ఎఫ్ఐఆర్ నమోదైందని చెప్పారు. భారత సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతను కించపర్చడమే కాకుండా శత్రుత్వాన్ని ప్రోత్సహించడం, స్వాతంత్ర్య సమరయోధులను అవమానించినట్లు, తమ విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నారని, సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారని నాయకులపై చోటిలా పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ పేర్కొంది.

ఆ పదవులకు మమత రాజీనామా చేయాలి

వామపక్ష సంఘటన డిమాండ్

కోల్‌కతా: బెంగాల్‌లో వైద్యురాలిపై అత్యాచారం, హత్య క్రమంలో ఆర్జీ కార్ వైద్య కళాశాల, ఆసుపత్రిపై దాడి, హింసను వామపక్ష సంఘటన ఖండించింది. ఆసుపత్రిలో విధ్వంసాన్ని ఆక్షేపించింది. కారకులను గుర్తించి అరెస్టు చేయాలని పేర్కొంది. ఇందుకు బాధ్యత వహిస్తూ, ఆరోగ్యశాఖ, హోంశాఖ మంత్రిగా మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. కోల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ రాజీనామాను వామపక్ష సంఘటన చైర్మన్ బిమన్ బోస్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ విధ్వంసకాండకు వ్యతిరేకంగా 'ధిక్కార్ దివస్' పేరిట ఆందోళన చేస్తామని ప్రకటించారు. వైద్యురాలిపై అత్యాచారం, హత్య కేసులో విచారణను సీబీఐ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈనెల 17న కోల్‌కతాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు.

లౌకిక ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యాలయంలో గురువారం 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ 143 కోట్ల మంది జనాభాలో ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, పార్శీలు వంటి వివిధ మతాలు, కులాల వారు కలిసి ఉండటానికి అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే కారణమన్నారు. ఈ రాజ్యాంగాన్ని రక్షించుకోవటం, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటానికి నడుం బిగించాలని పిలుపునిచ్చారు. 1925లో సీపీఐ ఆవిర్భవించి స్వాతంత్రోద్యమంలో వివిధ వర్గాల ప్రజలను సమీకరించి పోరాటంలో పాల్గొందన్నారు. స్వాతంత్ర సమరంలో పాల్గొన్న పార్టీగా సీపీఐ నిలవడం గర్వంగా ఉందన్నారు. స్వాతంత్రోద్యమంలో ఏ మాత్రం పాల్గొనని వారు అధికారం చేపట్టి చరిత్రను వక్రీకరిస్తున్నారని విమర్శించారు. ఎవరైతే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని త్యాగాలు చేశారో వారిని స్మరించుకుంటూ స్వాతంత్ర్య ఫలాలను అందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత సీపీఐకు ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ బెంగాల్లో వైద్యురాలని అత్యంత కిరాతకంగా హత్య చేయటం, నాలుగేళ్ల పసిపాపను చంపటం చూస్తుంటే మహిళలకు ఇంకా స్వాతంత్ర్యం రాలేదనిపిస్తోందన్నారు. మహిళా సాధికారతపై పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నూతన విద్యావిధానం తీసుకువచ్చి విద్యను కాషాయికరణ చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు పి చంద్ర నాయక్, కోశాధికారి ఆర్. పిచ్చయ్య నాయకులు ఎస్కే నజీర్లు స్వాతంత్ర పోరాట వీరులను స్మరిస్తూ దేశభక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, రాష్ట్ర నాయకులు వై. చెంచయ్య, ప్రొఫెసర్ సి. నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్ హోమ్‌కి జగన్ గైర్హాజర్

హాజరైన చంద్రబాబు, పవన్, రామకృష్ణ, షర్మిల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంప్రదాయం ప్రకారం రాజ్ భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ 'ఎట్ హోమ్' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ తేనీటి విందు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల హాజరయ్యారు. మాజీ సీఎం, విపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి మాత్రం ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. చివరకు ఆ పార్టీ తరఫున ప్రతినిధులను కూడా ఎవరినీ పంపలేదు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌కుమార్ ఠాగూర్, మరికొందరు న్యాయమూర్తులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, వివిధ రంగాల ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి అందరినీ పలుకరించారు. మంత్రి నారా లోకేశ్ కూడా ముఖ్యులను అందరినీ వారి టేబుల్ వద్దకు వెళ్లి పలుకరించారు. కార్యక్రమానికి హాజరైన టీడీపీ మంత్రులను గవర్నర్‌కు పరిచయం చేశారు.

పోరాటాలతోనే ఉక్కు పరిరక్షణ

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: పోరాటాల తోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు స్పష్టం చేశారు. 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కూర్మన్న పాలెం ఉక్కు దీక్షా శిబిరాన్ని గురువారం ఓబులేసు సందర్శించారు. అనంతరం దీక్షా శిబిరం వద్ద విశాఖ స్టీల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఏర్పాటు చేసిన జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేశారు. అనంతరం ఓబులేసు మాట్లాడుతూ మహనీయుల త్యాగఫలంతో సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని నేడు కేంద్ర ప్రభుత్వం మరోసారి విదేశీ బహుళజాతి కంపెనీల చేతుల్లో పెట్టేందుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించకుండా, ప్రైవేటీ కరణకు పెద్దపీట వేస్తోందన్నారు. మరో స్వాతంత్ర్య పోరాటంలో ఉక్కు పరిరక్షణ పోరాటం చేయాల్సి ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాట యోధుల స్ఫూర్తితో ఉక్కు పరిరక్షణకు కార్మికులు, ఉద్యోగులు, యువత నడుంబిగించాలని పిలుపునిచ్చారు. నెలన్నర క్రితం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సందర్శించిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్. డి.కుమారస్వామి విశాఖ ఉక్కు ను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని అన్నారని, కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును నూటికి నూరు శాతం అమ్ముతామని ప్రకటన చేయడం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం విరుద్ధ ప్రకటనలు చేయడంతో ఉక్కు కార్మిక వర్గం అసంతృప్తికి గురయిందని అన్నారు . ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన ఈ కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమగా కొనసాగే వరకు పోరు ఆపేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, రామస్వామి, కె ఎస్ ఎన్ రావు, ఎన్. రామారావు, రామకృష్ణ, సన్యాసిరావు, వరసాల శ్రీనివాసరావు తో పాటు వందలాది మంది కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు వృథా కానివ్వం: ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో అమరులైన మహనీయుల త్యాగాలు వృథా కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గుంటూరు మల్లయ్యలింగంభవన్ వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముప్పాళ్ల మాట్లాడుతూ... దేశంలో అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులు సెకనుకు రూ.8 లక్షల ఆదాయం సంపాదిస్తుంటే... పూట గడవని జనాభా దేశంలో 27 శాతంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో నేటికి రహదారుల సౌకర్యాం లేక డోలీ సంస్కృతి కొనసాగుతుండటం విచారకరమన్నారు. పేదలకు ఆరోగ్యం పూర్తి స్థాయిలో లభించడం లేదని, గ్రామీణ వ్యవసాయ కూలీలు, దళిత, గిరిజన, బలహీన వర్గాలకు పూర్తి స్థాయిలో విద్యా అవకాశాలు అందుబాటులో లేని పరిస్థితులు నేటికీ కనబడుతున్నాయన్నారు. దేశ ప్రజల సౌభాగ్యం, వ్యక్తిగత స్వేచ్ఛ, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవడం, లౌకిక వ్యవస్థ పరిరక్షణ కోసం 78వ స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అనేక మంది కమ్యూనిస్టు యోధులు ప్రాణత్యాగం చేశారని తెలిపారు. త్యాగాలు, వీర పోరాటాల ద్వారా సాధించుకున్న స్వరాజ్యం నేడు కార్పొరేట్ అనుకూల, మతోన్మాద శక్తుల చేతిలో చిక్కి శల్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ విధానాల వల్ల దేశ సౌభ్రాతృత్వానికి ప్రమాదం వాటిల్లుతున్న తరుణంలో మరో స్వాతంత్ర్య పోరాటానికి సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ నేడు దేశంలో సంపద అంతా ఒకచోట కేంద్రీకృతమౌతుంటే మరొవైపు పేదల సంఖ్య పెరుగుతోందన్నారు. సమసమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, నగర ఆటో యూనియన్ కార్యదర్శి మంగా శ్రీనివాసరావు, ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి బండారపు యశ్వంత్, ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి చెవుల పున్నయ్య, సీపీఐ నగర సమితి సభ్యులు ఆకిటి రామచంద్రుడు, ధూపాటి వెంకటరత్నం, ఇ.వెంకటేశ్వర్లు, వలి, యోగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర వాసులకు మరింత చేరువగా 'విశాలాంధ్ర'

విశాఖలో నూతన ప్రింటింగ్ భవనానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-మధురవాడ (విశాఖ): ప్రజల గొంతుకై విశాలాంధ్ర కలకాలం పని చేయాలని విశాలాంధ్ర విజ్ఞాన సమితి పాలకవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు ఆకాంక్షించారు. గురువారం మారికవలస విశాలాంధ్ర విశాఖపట్నం ఎడిషన్ కార్యాలయం ప్రాంగణంలో నూతన ప్రింటింగ్ భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టారు. ముఖ్య అతిథులుగా హాజరైన విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథ్‌రెడ్డి, డీజీఎం మనోహర్‌నాయుడు సమక్షంలో భవన నిర్మాణ శంకు స్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో విశాలాంధ్ర మరిన్ని హంగులతో ఉత్తరాంధ్ర జిల్లాలకు అందుబాటులో ఉండేందుకు సొంత ప్రింటింగ్ భవనాన్ని ఏర్పాటు చేసుకుని, పెద్దల వారసత్వంతో వచ్చిన విజ్ఞాన భాండాగారాన్ని ప్రజలందరికి అందించాలనే కృతనిశ్చయంతో విశాలాంధ్ర పత్రిక విశాఖ కేంద్రంగా సొంతంగా ప్రింటింగ్ చేసుకుని ప్రజలకు చేరువకానుందన్నారు. ఈ భవన నిర్మాణానికి కృషి చేస్తున్న ఉత్తరాంధ్ర జిల్లాల విలేకరులు, స్టాఫ్ రిపోర్టర్లు, బ్యూరోలకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలియజేశారు. జీఎం హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు మరింత చేరువై ప్రజల గొంతుకగా విశాలాంధ్ర పనిచేస్తోందన్నారు. 72 ఏళ్లుగా విశాలాంధ్ర ప్రజల గొంతుకై పని చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో సొంత భవనాలతో విశాలాంధ్ర ఇతర పత్రికలకు దీటుగా మరింత ముందుకు పోతుందన్నారు. విశాలాంధ్ర పాఠకులు, ప్రకటనకర్తలు, సానుభూతిపరులు, శ్రేయోభిలాషులు విరివిగా విరాళాలు ఇచ్చి ఈ ప్రింటింగ్ భవన నిర్మాణానికి తోడ్పడాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. డీజీఎం మనోహర్ నాయుడు మాట్లాడుతూ విశాలాంధ్ర విశాఖ కేంద్రంగా సొంత ప్రింటింగ్ భవనం నిర్మాణం కానుండటం ఆనందంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశాలాంధ్ర సేవలు మరింత విస్తృతం కానున్నాయని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సీపీఐ కార్యదర్శి కూరంగి మన్మథరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వాసులకు విశాలాంధ్ర వెన్నుదన్నుగా నిలిచి ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేయాలని, అందుకోసం తమ వంతు సహకారం కూడా అందిస్తామని చెప్పారు.

విరివిగా విరాళాలు

ఈ భవన నిర్మాణానికి పార్వతీపురం మన్యం జిల్లా విశాలాంధ్ర విలేకరులు సేకరించిన లక్షరూపాయలను స్టాఫ్ రిపోర్టర్ మంతిన రమేశ్, శ్రీకాకుళం జిల్లా బ్యూరో రమేశ్ సారథ్యంలో శ్రీకాకుళం టౌన్ రిపోర్టర్ పేడాడ హేమసుందర్ రూ.50 వేలు విరాళాన్ని శంకుస్థాపన అనంతరం జీఎం హరినాథరెడ్డి, డీజీఎం మనోహర్ నాయుడుకు అందజేశారు. భవన నిర్మాణం కోసం విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం ఆనందపురం నుంచి రిపోర్టర్ రౌతు నాగరాజు రెండు యూనిట్ల ఇసుకను అందజేయగా, గాజువాక రిపోర్టర్ కె.రమణ వంద బస్తాల సిమెంట్, విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజక వర్గంలో విజ్ఞాన సమితి పాలకవర్గ సభ్యులు పి.కామేశ్వర రావు సహకారంతో రిపోర్టర్లు 14 యూనిట్లు 20 ఎంఎం మెటల్, 7 యూనిట్లు 40 ఎంఎం మెటల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎడిషన్ మేనేజర్ నర్సింహులు, విశాఖపట్నం బ్యూరో పి.రామ కృష్ణ, మధురవాడ ఏరియా సీపీఐ కార్యదర్శి వాంద్రాసి సత్యనారాయణ, నాయకులు జి.వేలంగిణీరావు, బంగారయ్య, రిపోర్టర్లు, సబ్ ఎడిటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మంతిన రమేష్ ప్రింటింగ్ భవన నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం జిల్లా బ్యూరో రమేష్ ద్వారా ప్రింటింగ్ భవన నిర్మాణానికి రూ.50 వేలు విరాళం అందజేస్తున్న దృశ్యం

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు గుడివాడ పర్యటన సందర్భంగా పోలీసుల ముందస్తు అరెస్టులు చేయడం గర్హనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. గుడివాడ రూరల్ పోలీసులు ఈనెల 14వ తేదీన స్థానిక నేతలను అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ మాదిరికాకుండా నూతన ప్రభుత్వంలో ముందస్తు అరెస్టులు ఉండబోవని, ఆ విధంగా పోలీసులకు ఆదేశాలిస్తామని మంత్రి లోకేశ్ ప్రకటించిన వారం రోజులకే మళ్లీ ముందస్తు అరెస్టులు జరగడం అప్రజాస్వామికమని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఐక్యరాజ్య సమితి దౌత్యాధికారితో యార్లగడ్డ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి భారత శాశ్వత రాయబార కార్యాలయ దౌత్యాధికారి రవీంద్రన్‌తో రాజ్యసభ మాజీ సభ్యుడు, విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గురువారం భేటీ అయ్యారు. ఐక్యరాజ్య సమితిలో అధికార భాషగా హిందీని చేర్చే అంశంపై వారిద్దరూ చర్చించారు. ప్రస్తుతం ఐక్యరాజ్య సమితిలో ఫ్రెంచి, ఇంగ్లీష్, చైనీస్, రష్యన్, అరబిక్, స్పానిష్... ఆరు భాషలే అధికార భాషలుగా ఉన్నాయని, ఐక్యరాజ్య సమితిలో వాజ్‌పేయి, పీవీ నరసింహారావు, మోదీ మాత్రమే హిందీలో ఇప్పటివరకు ప్రసంగించారని యార్లగడ్డ గుర్తుచేశారు. దౌత్యాధికారి రవీంద్రన్ ప్రభుత్వ పరంగా చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. అధికార భాషగా హిందీ గుర్తింపు పొందడానికి అవసరమైన నిధుల మంజూరు విషయంలోను భారత ప్రభుత్వం సిద్ధంగానే ఉందన్నారు. హిందీ అధికార భాషగా చేర్చాలంటే ఐక్యరాజ్య సమితిలోని 196 సభ్య దేశాల్లో మూడో వంతు దేశాలు మద్దతు ఇవ్వాలని రవీంద్రన్ వివరించారు.

ఆత్మీయ పలకరింపు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఏర్పాటు చేసిన 'ఎట్ హోం' (తేనీటి విందు) కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆప్యాయంగా పలకరించారు.

డిమాండ్ల సాధనే లక్ష్యం

పంజాబ్, హర్యానా రైతుల ట్రాక్టర్ మార్చ్

చండీగఢ్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పంజాబ్, హర్యానాలోని రైతులు ట్రాక్టర్ మార్చ్‌లు నిర్వహించారు. ఎంఎస్‌పీకి చట్టబద్ధతతో పాటు పెండింగ్ డిమాండ్లను పరిష్కరించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) పిలుపు మేరకు ట్రాక్టర్ మార్చ్‌లు జరిగాయి. అమృత్‌సర్‌లో జరిగిన ర్యాలీలో జాతీయ, రైతు సంఘాల జెండాలతో 600 ట్రాక్టర్లు పాల్గొన్నాయి. రైతు నేత సర్వర్ సింగ్ పంధేర్ నాయకత్వంలో అట్టారీ నుంచి గోల్డెన్ గేట్ వరకు 30కిమీల మేర ఈ యాత్ర సాగింది. రైతులకు న్యాయమైన కనీస మద్దతు ధర లభించడం లేదని, డిమాండ్ల పరిష్కరించడానికి చర్యలు తీసుకునే చిత్తశుద్ధి కేంద్రానికి లేదని పంధేర్ వ్యాఖ్యానించారు. డిమాండ్లను పరిష్కరించేంత వరకు శంభు, ఖనౌరి సరిహద్దుల వద్ద తమ పోరు కొనసాగుతుందని రైతులు స్పష్టంచేశారు. భటిండాలోనూ ట్రాక్టర్ ర్యాలీ జరిగింది. హర్యానాలోని అంబాలాలో నిర్వహించిన ర్యాలీ బలానా, షాజాద్పూర్, నారాయణ్‌ఘర్ గ్రామాల గుండా సాగింది. ఈ మార్చ్‌కు రైతు నవదీప్ సింగ్ నేతృత్వం వహించారు. భారతీయ కిసాన్ యూనియన్ (షహీద్ భగత్ సింగ్) నేత తేజ్వీర్ సింగ్ నాయకత్వంలో రైతుల ట్రాక్టర్ మార్చ్ పంచ్‌కులలోని పింజోర్‌లో సాగింది.

హత్యాచార దోషులను శిక్షించాలి: ఏఐఎస్‌ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కోల్‌కతాలోని ఆర్జీ కార్ వైద్య కళాశాలఆసుపత్రిలో అమానుష ఘటన దేశం సిగ్గుతో తలదించుకునేలా చేసిందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు పేర్కొన్నారు. వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడి, అత్యంత క్రూరంగా హత్యచేసిన వారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. దేశంలో నిత్యం పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు మహిళలపై ఘోరాలు జరుగుతున్నాయని... ప్రభుత్వాలు కట్టుదిట్ట చట్టాలు అమలు చేయాలన్నారు.

షేక్ హసీనాపై ఐసీటీ దర్యాప్తు

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు ఇతరులపై అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసీటీ) విచారణ మొదలుపెట్టింది. ఈనెలారంభంలో చెలరేగిన హింస, మానవాళి వ్యతిరేక నేరాలపై దృష్టిని కేంద్రీకరించింది. ఐసీటీ దర్యాప్తు సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఎంఏ రెహమాన్ మాట్లాడుతూ ఐటీసీ చట్టం 1973లోని 3(2), 4(1)/4(2) సెక్షన్ల పరిధిలోని నేరాలు జరిగినట్లు నిపుణులు అభిప్రాయపడినట్లు తెలిపారు. మారణహోమం కేసులో దర్యాప్తు అధికారి నియమితులయ్యారు. పత్రికలను సేకరిస్తూ ఈ వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు దర్యాప్తు సంస్థ చర్యలు చేపట్టినట్లు పిటిషన్‌దారు, న్యాయవాది గాజీ ఎంహెచ్ తమీమ్ వెల్లడించారు.

సెప్టెంబరు 15నాటికి దర్యాప్తు నివేదిక ఇవ్వండి: ఢాకా కోర్టు

షేక్ హసీనాతో పాటు ఆరుగురిపై దాఖలైన దుకాణదారుడి హత్య కేసులో సెప్టెంబరు 15 నాటికి దర్యాప్తు నివేదిక ఇవ్వాలని పోలీసులకు ఢాకా కోర్టు ఆదేశించింది. కోటా పోరులో అబూ సయీద్ అనే దుకాణదారుడు పోలీసుల కాల్పుల్లో చనిపోగా, షేక్ హసీనాపై హత్య కేసు నమోదైంది. ఢాకా మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మహమ్మద్ జాకీ అల్ ఫరాబీ ఈ కేసును విచారించారు. తదుపరి విచారణను సెప్టెంబరుకు వాయిదా వేశారు.

మాజీ మంత్రి, డిప్యూటీ స్పీకర్ అరెస్టు

కోటా పోరు సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి బంధుమిత్రులు పెట్టిన హత్య కేసుల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ షంసుల్ హక్ తుకు, మాజీ మంత్రి జునైద్ అహ్మద్ పలక్ అరెస్టయ్యారు. రాజధాని ఢాకాలోని పల్టన్ పోలీసు స్టేషన్‌లో వీరిపై హత్య కేసు నమోదైంది. అలాగే ఢాకా విశ్వవిద్యాలయం అనుబంధ ఛాత్ర లీగ్ ప్రధాన కార్యదర్శి తన్వీర్ హసన్ సైకత్, మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వంలో ప్రైవేటు పరిశ్రమల వ్యవహారాల సలహాదారు సల్మాన్ ఎఫ్ రెహమాన్, న్యాయశాఖ మాజీ మంత్రి అన్సిరుల్ హక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెహమాన్, హక్‌ను ఢాకాలోని సదర్‌ఘాట్ వద్ద పట్టుకున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. కోటా పోరులో 500 మంది చనిపోగా అనేక హత్య కేసులు నమోదయ్యాయి.

సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలి: ఐరాస

కోటా పోరు నేపథ్య హింసతో అట్టుడికిపోయిన బంగ్లాదేశ్‌లో అస్థిరత దృష్ట్యా ఏర్పాటైన ఆపద్ధర్మ ప్రభుత్వం వెంటనే పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.